భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక: 292 హైదరాబాద్, 14-5-2026 , గురువారం పేజీలు: 12 వెల: 1.00

## విషాదం.. లిఫ్ట్‌లో చిక్కుకుని చిన్నారి మృతి

హైదరాబాద్, మే13: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌలిదొడ్డిలో విషాదం చోటుచేసుకుంది. లిఫ్ట్‌లో చిక్కుకుని ఐదేళ్ల చిన్నారి మృతిచెందింది. ఓ మహిళా హాస్టల్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. మరణించిన చిన్నారిని పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిస్తు ఘోష్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన ప్రకారం..పశ్చిమ బెంగాల్‌కు చెందిన దంపతులు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఈ క్రమంలోనే గౌలిదొడ్డిలో మహిళా హాస్టల్‌లో వంట పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

# టూరిజం, టెంపుల్ కారిడార్లపై సీఎం ప్రత్యేక ప్రణాళిక

హైదరాబాద్, మే13 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో మెగా గ్రోత్ కారిడార్‌పైన ఈరోజు (బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ దేవేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్‌లకు ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన ఎస్టీపీలు డిజైన్ చేయాలని దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎయిర్‌పోర్టులను దృష్టిలో ఉంచుకొని రోడ్ల పనులు చేపట్టాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంలో సాంకేతికతను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఖర్చు తగ్గించుకోవడానికి ఈవీ వాహనాలను ప్రవేశపెట్టాలని సూచించారు. లీజ్‌కు తీసుకునే వాహనాలు కూడా ఈవీలే ఉండాలని స్పష్టం చేశారు.

సోలార్ ఎనర్జీ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలి..

ప్రతి చోట పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అర్బన్ సెంట్రిక్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ ఉండాలని దిశానిర్దేశం చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్స్, వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు అర్బన్ ప్లానింగ్‌లో తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో సోలార్ ఎనర్జీ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. పట్టణాలు, నగరాల్లో రేడియేషన్ తగ్గించడానికి మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిచోట స్మార్ట్‌పోల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా నగరాలు, పట్టణాల జనాభా తగినట్లు స్థానికంగా డిజైన్ చేసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణపైన ఏఐ వినియోగంపైన సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. సీవరేజ్ అండ్ వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు నుంచి శుద్ధి చేసిన నీటినే భవన నిర్మాణాల్లో వాడేలా నిబంధన పెట్టాలని ఆదేశించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు కావాల్సిన నీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని నిర్దేశించారు. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను ఒక యూనిట్‌గా చేయాలని దిశానిర్దేశం చేశారు.

టెంపుల్ కారిడార్ ఏర్పాటు చేయాలి..

సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్ట్‌లను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలని సూచించారు. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని అన్నారు. మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొత్తగూడం, పాల్వంచ, సుజాతనగర్ కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలని అన్నారు. రేడియల్ రోడ్లు పెద్ద మున్సిపాలిటీలకు



సమీపంలో ఉండేలా డిజైన్ చేయాలని ఆదేశించారు. వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా డిజైన్ చేయాలని సూచించారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం కారిడార్ భవిష్యత్తు తెలంగాణకు చాలా కీలకమని వ్యాఖ్యానించారు. ఎయిర్‌పోర్ట్ రాకతో ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయని వివరించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ డిఫెన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతుందని చెప్పుకొచ్చారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, స్మార్ట్‌పోల్స్, రోడ్ల, ఎస్‌టీపీలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఈవీ వంటి అంశాలపైన ప్రతి చోట ఒకే విధమైన ప్రణాళికతో ముందుకు పోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## హిందూమతం ఓ జీవన విధానం.. తన విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి..: సుప్రీంకోర్టు

హిందూ మతం ఒక జీవన విధానమని, ఒక వ్యక్తి తన విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి ఆలయానికి వెళ్లడం, ఆచారాలను పాటించడం తప్పనిసరేం కాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో మహిళల ప్రవేశాలకు సంబంధించి దాఖలైన పిటిషన్ విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆలయాలకు వెళ్లకపోయినా, ఇంట్లో దీపం వెలిగించుకుంటే అంది హిందూమతంపై విశ్వాసాన్ని సూచిస్తుందని పేర్కొంది (రాబజూతీవఎవ జశీబతీ ఎఱఅఎబఱంఎ).



సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ పిటిషన్‌పై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసింది (ఎఱఅఎబఱంఎ ఋఎ శీట శ్రీఱటవ). హిందూమతం అనేది ఒక జీవన విధానమని, తన విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి ఆలయాలకు వెళ్లాలనే నిబంధనం లేదని పేర్కొన్నారు. ప్రతి మత ఆచారాన్ని, మత సంబంధ విషయాలను న్యాయస్థానం ముందు ప్రశ్నించడం ప్రారంభిస్తే.. వందలాది పిటిషన్లు వస్తాయని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది.




## పార్కింగ్ సమస్యపై 'ఉబర్' దృష్టి సారించాలి: సీఎం రేవంత్

హైదరాబాద్: ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై ఉబర్ సంస్థ దృష్టి సారించాలని ఆ సంస్థ ప్రతినిధులకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఉబర్ సీఈవో దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని బృందం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయనతో భేటీ అయింది. ఈ సందర్భంగా ఉబర్ వ్యాపార కార్యకలాపాలను సీఎంకు సీఈవో వివరించారు. హైదరాబాద్‌లో ఉన్న ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను విస్తరిస్తున్నట్లు తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని.. ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు ఖోస్రోషాహి వివరించారు.

తగిన పార్కింగ్ సౌకర్యాలు లేకపోవడంతో మెట్రో స్టేషన్ల వంటి ప్రాంతాల్లో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. మల్టీ లెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టిసారించాలని సూచించారు. ఈ సూచనలపై సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధి బృందం సీఎంకు తెలిపింది. ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ అంశాన్ని ప్రతినిధులకు సీఎం వివరించారు. 30వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైందన్నారు. ప్రఖ్యాత 500 కంపెనీలను అక్కడికి ఆహ్వానిస్తున్నామని.. ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయ నిర్మాణానికి ఆసక్తిగా ఉన్నట్లు ఉబర్ సీఈవో తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తరణ చేపడతామన్నారు. దీనికి ప్రభుత్వ సహకారం ఉండాలని సీఎంను కోరారు.

## నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దూకుడు.. ఐదుగురి అరెస్ట్

ఢిల్లీ, మే13 ): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తోంది. ఈ



లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకురావడానికి అధికారులు కృషి చేస్తున్నారు.

నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తున్నారు.

సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతానికి చెందినవారు.

అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు.

రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గఢ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు ఈరోజు (బుధవారం) ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది.

రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండగానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్‌లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు.

## పెళ్లి వాహనం బోల్తా.. ఒకరి మృతి, 19 మందికి గాయాలు



మహబూబ్‌నగర్ ( మహబూబ్‌నగర్ జిల్లాలో పెళ్లి వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. 19 మందికి గాయాలయ్యాయి.

మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం చిన్నచింతకుంట మండలం దమాగ్నాపూర్ గ్రామానికి చెందిన 20 మంది బొలెరో వాహనంలో భూత్పూర్ మండలంలో జరుగుతున్న ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం తిరిగి తమ గ్రామానికి వెళ్తున్న క్రమంలో మహబూబ్‌నగర్‌లోని కొత్త కలెక్టరేట్ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలుడు సాయి వర్షిత్ (6) అక్కడికక్కడే మృతిచెందగా.. మిగతా వారికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

భారత శక్తి

# మోడీ గోల్డన్ స్ట్రోక్...

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థను ఊపిరి ఆడనివ్వకుండా చేస్తోంది. పెరుగుతున్న నిర్మాణ వ్యయం, ముడిసరుకు కొరత, విదేశీ మారక నిల్వలపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అత్యంత కఠినమైన నిర్ణయాల వైపు అడుగులు వేస్తోంది. మరో వైపు కేంద్రం బంగారం విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బంగారం, వెండి, ప్లాటినం దిగుమతుల మీద సుంకం రెట్టింపు చేసింది. ఇప్పటిదాకా అది ఐదు శాతం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఏకంగా 10 శాతానికి పెరిగిపోయింది. ఇది మంగళవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది. ఆభరణాల తయారీకి వాడే వస్తువులు.. ఇతర లోహాలు.. పారిశ్రామిక దిగుమతులకు కూడా ఇది వర్తిస్తుంది. దీంతో దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.. ఇప్పటికే బంగారం ధర (24 క్యారెట్లు) 1,40,000 మించి ట్రేడ్ అవుతోంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఆ ధర మరింత పెరిగే అవకాశం ఉంది.బంగారం దిగుమతులు పెరుగుతుండడం కేంద్ర ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ధరలు పెరుగుతున్నప్పటికీ చాలామంది బంగారం మీద ఇన్వెస్ట్ చేస్తున్నారు. మార్కెట్ నిపుణులు కూడా బంగారం మీద ఇన్వెస్ట్ చేయాలని సూచనల మీద సూచనలు చేస్తున్న నేపథ్యంలో.. చాలామంది ఇతర రంగాలను పక్కనపెట్టి.. కేవలం బంగారం మీద మాత్రమే ఇన్వెస్ట్ చేస్తున్న నేపథ్యంలో.. ఇతర రంగాలలో కొనుగోళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో ఆయా రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి అంతగా సాగడం లేదు. అందువల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకొని ఉంటుందని తెలుస్తోంది. బంగారం కొనుగోళ్లు ఏడాదిపాటు తగ్గిపోతే మన దేశానికి సంబంధించిన విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరుగుతాయని కేంద్రం అంచనా వేస్తోంది.కేవలం బంగారం, ఇతర ఖరీదైన లోహాలు మాత్రమే కాదు.. ఆహార పదార్థాల ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. దేశంలో ఏప్రిల్ నెలకు సంబంధించి రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా నాలుగు నెలల గరిష్టానికి చేరుకుంది. నాలుగు నెలల క్రితం ఇది 3.48 శాతంగా ఉండేది. జనవరిలో 2.74 శాతంగా ఉండేది. దీనికి ప్రధాన కారణం ఆహార ధరల పెరుగుదలే. వరుసగా ఆలు.. ఉల్లి.. టమాటా ధరలు క్రాష్ అయ్యాయి. మిగతా ఉత్పత్తుల ధరలు పెరిగాయి. దీంతో నాలుగు నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం గడిచిన నాలుగు నెలల్లో 2.13 శాతం నుంచి 4.2 శాతం వరకు పెరిగింది. జ్యువెలరీ, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్స్ వంటి వాటిపై ఏప్రిల్ లో ద్రవ్యోల్బణం 53.61 శాతానికి చేరుకుంది. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నిర్మాణ పనులను రెండేళ్ల పాటు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సిఫార్సు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది.నీతి ఆయోగ్ సిఫార్సుల ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ సెక్రటేరియట్ పునర్నిర్మాణ పనులను కూడా ప్రస్తుతానికి వాయిదా వేయనున్నారు. నిర్మల్ భవన్, ఉద్యోగ్ భవన్ వంటి భవనాల కూల్చివేత, కొత్త నిర్మాణాలను వాయిదా జాబితాలో చేర్చారు. యుద్ధం కారణంగా స్టీల్, సిమెంట్ వంటి ముడిసరుకుల సరఫరాలో అంతరాయం కలగడం, దిగుమతి ఖర్చులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుత ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక విన్నపం చేశారు. విదేశీ వస్తువుల వాడకాన్ని తగ్గించి, స్వదేశీ వనరులపై ఆధారపడాలని కోరారు. ముఖ్యంగా ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు పాఠశాలలకు ఆన్‌లైన్ తరగతులను నిర్వహించాలని సూచించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కోవిడ్ కంటే భయంకరమైన సంక్షోభం ఇదని ప్రధాని వ్యాఖ్యానించడం తీవ్రతకు అద్దం పడుతోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదనలు, యుద్ధ ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. సెన్సెక్స్ ఏకంగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు మండుతుండటంతో భారత రూపాయి విలువ ఆల్ టైమ్ లో 95.28 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది సామాన్యులపై నిత్యావసర వస్తువుల ధరల భారం పెంచే ప్రమాదం ఉంది.మరోవైపు, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తున్నాయి. నిర్మాణ రంగం ఆగిపోతే లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని, ఆన్‌లైన్ క్లాసుల వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నాయి. ఒక దేశం వద్ద ఉన్న విదేశీ మారకద్రవ్యం, బంగారం, ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ వద్ద ఆదేశానికి సంబంధించిన కరెన్సీ హక్కులు, ఐఎంఎఫ్ లో సభ్యత్వం తీసుకున్నప్పుడు.. ఆ దేశం రిజర్వ్ చేసిన సొమ్ములో 25 శాతం. ఇలా ఈ నాలుగింటిని కలిపి విదేశీ మారక ద్రవ్య నిల్వలు అని పిలుస్తుంటారు.. ఇవి ఒక దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంటాయి. వీటిని అంచనా వేసి ఆ దేశం ఆర్థికంగా ఏ స్థాయిలో ఉందో అన్ని పనులు అంచనా వేస్తారు..మూడీస్, ఎస్ అండ్ పీ, ఫిచ్ వంటి సంస్థలు ఫారెక్స్ రిజర్వ్ అధికంగా ఉన్న దేశాలకు అద్భుతమైన రేటింగ్ ఇస్తాయి. ఈ రేటింగ్ గనక అధికంగా ఉంటే.. ఆదేశాలకు తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తుంటాయి. ఉదాహరణకు మనం లోన్ కోసం బ్యాంకు దగ్గరికి వెళ్తే.. మన సిబిల్ స్కోర్ చూస్తుంటారు. అది బాగుంటే బ్యాంక్ అధికారులు లోన్ వెంటనే మంజూరు చేస్తుంటారు. ఇదే విధానాన్ని దేశాలకు కూడా అప్పులు ఇచ్చే సంస్థ పాటిస్తుంటాయి.ఒక దేశంలో విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోతున్నాయంటే.. విదేశీ పెట్టుబడిదారులు తాము పెట్టిన ఇన్వెస్ట్మెంట్ మొత్తాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు లెక్క. ఒక దేశానికి సంబంధించి ఏడు నుంచి పది నెలల వరకు క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేయడానికి డబ్బులు ఉంటే.. ఆ దేశానికి సంబంధించిన పరపతి బాగున్నట్టు లెక్క. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనదేశ విదేశీ మారకద్ర నిల్వలు బాగానే ఉన్నాయి. పశ్చిమ ఆసియాలో యుద్ధాలు ముగిసే పరిస్థితి కనిపించకపోవడంతో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఎరువుల ధరలు కూడా భారీగా పెరుగుతాయని సమాచారం. దీనివల్ల ఫారెక్స్ నిల్వలు మరింత దారుణంగా కరిగిపోయే ప్రమాదం ఉంది.మన దేశానికి విదేశాల నుంచి వచ్చే డబ్బులో గల్ఫ్ ప్రాంతం నుంచి అధికంగా వస్తుంది. అక్కడ యుద్ధం వల్ల పరిస్థితులు మారిపోయాయి. మనవాళు పంపే డబ్బు పూర్తిగా తగ్గిపోయింది. పైగా మన ఎగుమతుల వల రావాల్సిన డాలర్ల ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. దీనివల్ల మనకు రావలసిన డబ్బు రాకపోగా.. ఉన్న డబ్బు ఖర్చు అవుతుంది. అందువల్లే ప్రధానమంత్రి ఆ స్థాయిలో హెచ్చరికలు చేశారు.అయితే, దేశ ఆర్థిక భద్రత దృష్ట్యా ఈ కఠిన నిర్ణయాలు తప్పవని బీజేపీ వర్గాలు సమర్థించుకుంటున్నాయి.

# సినీ హీరోలను వాడేసుకుంటున్న ఫ్యాన్

విజయవాడ, మే 13,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. వ్యూహాత్మకంగా కూడా ఉంటాయి. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా చేసే ప్రయత్నాలు బాగా ఆకట్టుకుంటాయి. ప్రధానంగా సినీ హీరోల అభిమానులను తన వైపునకు తిప్పుకునే ప్రయత్నంలో వైసిపి చేసే రాజకీయం మామూలుగా ఉండదు. ప్రస్తుతం టాలీవుడ్ ప్రముఖ హీరోల అభిమానులను వారికి తెలియకుండానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టర్న్ చేసుకోగలదు. అంత గొప్ప వ్యూహం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంతం. టిడిపి కూటమికి సినీ గ్లామర్ ఉంది. నందమూరి తో పాటు ఇతర సినీ పెద్దల అభిమానం ఉంది. జనసేనకు మెగా కాంపౌండ్ వాల్ నుంచి బలమైన సపోర్ట్ లభిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఆ స్థాయిలో లేదు. అందుకే ప్రముఖ హీరోల అభిమానులను వైసీపీ వైపు తిప్పుకునేందుకు సోషల్ మీడియాలో పెద్ద ప్రయత్నమే చేసింది. ఆ హీరోలంతా జగన్మోహన్ రెడ్డికి అభిమానులు అన్నట్టు సోషల్ మీడియాలో బిల్డప్ ఇస్తోంది.యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ విషయంలో అటువంటి ప్రచారమే చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికీ చేస్తూనే ఉంది. ప్రభాస్ పెదనాన్న రెబల్ స్టార్ కృష్ణంరాజు. ఆయన బిజెపిలో ఉండేవారు. బిజెపి నేతగానే చనిపోయారు. ఒకానొక దశలో కృష్ణం రాజు జనసేనలో చేరుతారని అప్పట్లో ప్రచారం నడిచింది. అయితే ఆయన అకాల మృతి చెందారు. ఆ సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కృష్ణంరాజు స్వగ్రామంలో పెద్ద కర్మ నిర్వహించారు. ఆ సమయంలో అయితే రాజశేఖర్ రెడ్డి పై కృష్ణంరాజుకు ఎంతో అభిమానం ఉండేదన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సహజంగానే రాజకీయ సినీ రంగాలకు దగ్గర సంబంధాలు ఉంటాయి. అప్పట్లో కృష్ణంరాజును రాజా అని రాజశేఖర్ రెడ్డి సంబోధించేవారని స్వయంగా రెబల్ స్టార్ ప్రకటించారు. దానిని పట్టుకొని యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తమ వాడే అన్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే దీనిని గుర్తించిన కృష్ణంరాజు భార్య ఏకంగా కూటమికి మద్దతు ప్రకటించడంతోపాటు ప్రచారం చేశారు. అయినా సరే ఇప్పటికీ ప్రభాస్ అభిమానులను వైసీపీ వైపు తిప్పుకోవడానికి ఆ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు.మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను సైతం వైసీపీ నిత్యం ఆకర్షిస్తూనే ఉంటుంది. నందమూరి, నారా ఫ్యామిలీలతో జూనియర్ ఎన్టీఆర్ కు గ్యాప్ ఉందంటూ ప్రచారం చేయడంలో వైయస్సార్ కాంగ్రెస్ సోషల్ మీడియా ముందుంటుంది. మంత్రి నారా లోకేష్ కోసం జూనియర్ ఎన్టీఆర్ ను పార్టీలో తొక్కేశారు అంటూ ప్రచారం చేయడంలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ పాత్ర ఉంది. సినిమాలే ప్రపంచం గా బతుకుతున్నారు జూనియర్ ఎన్టీఆర్. రాజకీయాల గురించి పట్టించుకునే స్థాయిలో లేరు ఆయన. అయితే అయిన దానికి కానీ దానికి ఫ్యాన్స్ మధ్య విభజన రేఖ గీసి.. వారిని తమ వైపు తిప్పుకునే పనిలో ఉంటుంది వైయస్సార్ కాంగ్రెస్. ఎప్పటికప్పుడు చంద్రబాబుతో పాటు లోకేష్ కు చెక్ పెట్టాలని జూనియర్ ఎన్టీఆర్ పేరును తెరపైకి తీసుకొస్తూ వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.అల్లు అర్జున్ విషయంలో అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అతిగా వ్యవహరించింది అని చెప్పవచ్చు. మెగా కాంపౌండ్ వాల్ నుంచి అల్లు అర్జున్ ను వేరుచేసి చూపడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాత్ర ఉంది. మొన్నటి ఎన్నికలకు ముందు తనకు అత్యంత ఆత్మీయుడైన ఓ వైసిపి అభ్యర్థికి సంఘీభావం తెలుపుతూ మద్దతు ప్రకటించారు అల్లు అర్జున్. అది మొదలు అల్లు అర్జున్ తమ వాడే అని చెప్పుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు. ఆయన సినిమాలు విడుదలైనప్పుడు హంగామా చేస్తూనే ఉంది. కేవలం పవన్ కళ్యాణ్ ను దృష్టిలో పెట్టుకొని.. మెగా ఫ్యామిలీతో అల్లు అర్జున్ కు విభేదాలు ఉన్నాయని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వెనుక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉంది. అలా అల్లు అర్జున్ అభిమానులను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం అన్నమాట.మహేష్ బాబును సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వదల్లేదు. వైయస్ రాజశేఖర్ రెడ్డి తో సూపర్ స్టార్ కృష్ణకు మంచి సంబంధం ఉండేది. కృష్ణ వియ్యపురాలు గల్లా అరుణ కుమారి కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. కృష్ణ సిఫారసులతో రాజశేఖర్ రెడ్డి అప్పట్లో ఆమెను క్యాబినెట్లో తీసుకున్నారని కూడా ఒక టాక్ ఉంది. పైగా స్వతహాగా ఎన్టీఆర్ను వ్యతిరేకించిన కృష్ణ కాంగ్రెస్ పార్టీలోనే సుదీర్ఘకాలం కొనసాగారు. అయితే రాజశేఖర్ రెడ్డి పై ఉన్న గౌరవంతోనే కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు జగన్ వెంటే అడుగులు వేశారు. అక్కడ తగినంత ప్రాధాన్యం లేకపోవడంతోనే ఆదిశేషగిరిరావు టిడిపిలోకి వచ్చేసారు. గల్లా అరుణ కుమారి తో పాటు ఆమె కుమారుడు జయదేవ్ సైతం టిడిపిలోకి వచ్చారు. జయదేవ్ స్వయానా మహేష్ బాబు బావ. రెండుసార్లు గుంటూరు ఎంపీగా గెలిచిన జయదేవ్ ను వెంటాడారు జగన్మోహన్ రెడ్డి. అందుకే మొన్నటి ఎన్నికలకు ముందు ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు జయదేవ్. అయినా సరే మహేష్ బాబును తమ వాడిగా చూపి ఓట్లు కొల్లగొట్టాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. అయితే సోషల్ మీడియా యుగం కాబట్టి ప్రజలకు అన్ని తెలుసు. ముఖ్యంగా హీరోల అభిమానులకు సైతం నేటి రాజకీయాల పట్ల స్పష్టమైన అవగాహన ఉంది. అయినా సరే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానుల ఓట్ల కోసం తపన పడుతోంది.

# టీడీపీలో కమిటీల లొల్లి...

గుంటూరు, మే 13,

టిడిపి లో ఇటీవల రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. జాతీయస్థాయిలో మంత్రి నారా లోకేష్ అదేవిధంగా పలువురు ఎంపీలు కూడా ఉన్నారు. రాష్ట్రస్థాయిలో విస్తృతమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేశారు. తద్వారా నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయాలని, వచ్చే ఎన్నికల నాటికి పార్టీ విస్తృతంగా పుంజుకోవాలన్నది ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా వైసీపీకి బలంగా ఉన్న కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో పార్టీని విజయవంతంగా ముందుకు నడిపించేందుకు వీలుగా ఈ కమిటీలు పనిచేయాలన్నది చంద్రబాబు చేసిన దిశా నిర్దేశం. ఈ క్రమంలోనే కొత్తవారికి అదేవిధంగా యువతకు కూడా ప్రాధాన్యం కల్పించారు. వీరికి పార్టీ పరంగా అన్ని విధాల అండదండలు ఉంటాయని కూడా చెప్పారు. అయితే కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి నాయకులు కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీలకు సహకరించటం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. కొత్తగా నియమించిన నాయకులు ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలకు మధ్య వివాదాలు.. తలెత్తుతున్నాయి. దీంతో కొత్త నేతలు తమ పనులను చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. పేరుకు మాత్రం కొత్తగా నాయకత్వాన్ని నియమించారని, కానీ క్షేత్రస్థాయిలో ఉన్న సీనియర్ నేతలను తమ మాట వినేలా కనీసం సూచనలు చేసేలా ఏమాత్రం దిశా నిర్దేశం చేయకపోవడాన్ని కొత్త నేతలు తప్పుపడుతున్నారు. ఇప్పుడిప్పుడే బాధ్యతలు చేపట్టిన తమకు ఎమ్మెల్యేల నుంచి ఎంపీల నుంచి సహకారం లేకపోతే ఏ విధంగా ముందుకు సాగాలని కూడా క్వశ్చన్ చేస్తున్నారు. ఉదాహరణకు కడప నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవి రెడ్డి కొత్తగా నియమించిన కమిటీలకు ఏమాత్రం సహకరించడం లేదనే వాదన బలంగా వినిపిస్తోంది.అదేవిధంగా అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోనూ ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొత్తగా నాయకులను నియమించినప్పటికీ వారి ప్రభావం కూడా కనిపించడం లేదు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిస్థితులు తీవ్రతరం అవుతున్న వాతావరణం కనిపిస్తుంది. ఇది కొత్త నాయకత్వానికి ముఖ్యంగా కొత్తగా ఏర్పాటు అయిన నాయకులకు కూడా ఇబ్బందికరంగా పరిస్థితులు తెచ్చేలాగా కనిపిస్తుంది. వీటిని సరిదిద్దాలని కొత్త నాయకత్వం పార్టీ అధిష్టానాన్ని కోరుతోంది.అయితే ఇప్పుడే కమిటీలను ఏర్పాటు చేశామని త్వరలో పుంజుకునే అవకాశం ఉందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చెబుతున్నారు. మరోవైపు రెండు మూడు మాసాల్లోనే స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో అద్భుత విజయాన్ని సొంతం చేసుకోవాలన్న ఉద్దేశంతోనే నూతనంగా కమిటీలను ఏర్పాటు చేశారు. అయితే ఈ లక్ష్యం ఏ మేరకు సాధిస్తారు.. ఏ మేరకు విజయం సాధించగలుగుతారు అనేది కమిటీలు పనిచేసే తీరును బట్టి ఆధారపడి ఉంటుంది. కానీ అసలు పని చేసుకునేందుకు అవకాశం కల్పించే వాతావరణం లేకపోవడం సీనియర్ నాయకులు స్పందించకపోవడం సహకరించకపోవడం అంటూ ఇప్పుడు ప్రధాన సమస్యలుగా మారాయి. వీటిని తక్షణం పరిష్కరించే దిశగా పార్టీ అధిష్టానం దృష్టి పెట్టాలన్నది కొత్తగా ఏర్పడిన కమిటీలు కోరుతున్నాయి. వీటిని పరిష్కారం చేయనంతవరకు తాము ఏ ప్రయత్నం చేసిన వృధా అవుతుందని కొందరు చెబుతున్నారు. మొత్తంగా కొత్త కమిటీలు ఏర్పాటు చేసినప్పటికీ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు మాత్రం కొనసాగుతూనే ఉండడం గమనార్హం.

# 2027 నాటికి పోలవరం పూర్తి

ఏలూరు, మే 13,



పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పై కీలక అప్డేట్ వచ్చింది. మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. 2027 జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని.. అదే నెలలో ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ ను కలిసిన తరువాత మంత్రి రామానాయుడు ప్రకటన చేయడం విశేషం. ఆంధ్రప్రదేశ్కు జీవనాడిగా పోలవరం ప్రాజెక్టును భావిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నత్తనడకన పనులు సాగాయి. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతం అయ్యాయి. ఏడాది కాలంలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది పోలవరం. ఎప్పటికప్పుడు మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షిస్తున్నారు. సీఎం చంద్రబాబు సైతం నిత్య పరిశీలనలతో పాటు సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేయిస్తున్నారు. ఏడాది కాలంలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది అని తెలుస్తుండడం మాత్రం శుభ పరిణామం.గోదావరి, కృష్ణా నదులను అనుసంధానిస్తూ ఏలూరు జిల్లా పోలవరం సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. అయితే 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించింది. ప్రారంభంలో రామ పాద సాగర్ గా పిలవబడిన ఈ పథకాన్ని పోలవరం ప్రాజెక్టు గా మార్చారు. 2004లో అధికారంలోకి వచ్చిన రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నదీ ప్రవాహానికి కుడివైపున ఒక స్పిల్ వే నిర్మించారు. ఈ స్పిల్ వేకు అడ్డంగా 48 గేట్లతో ఒక బ్యారేజీ నిర్మాణం చేపడుతున్నారు. నదీ ప్రధాన ప్రవాహానికి అడ్డంగా ఆనకట్ట నిర్మించి.. ఆ ప్రవాహాన్ని కుడివైపున ఉన్న స్కిల్ వేలోకి మళ్ళిస్తారు. ఈ ప్రాజెక్టుకు గేట్లు ఉండవు. కేవలం రాక్ ఫీల్డ్ డ్యామ్ మాత్రమే ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్టులో 1118 మీటర్ల పొడవు ఉండే స్పిల్ వే ప్రత్యేకమైనది.దాదాపు 22 సంవత్సరాల కిందట పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. కానీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత మాత్రమే ఈ ప్రాజెక్టుకు గుర్తింపు లభించింది. 2015లో జాతీయ ప్రాజెక్టుగా గుర్తించారు. పోలవరం జాప్యం జరగడంతో పట్టిసీమను తెరపైకి తెచ్చారు. పట్టిసీమ, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. 2015 లోనే దాదాపు 1300 కోట్లు ఖర్చు పెట్టి తొలి విడతగా పూర్తి చేశారు. అయితే మరో ఏడాది కాలంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసి? ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా పనులు చేయిస్తున్నారు. మరో ఏడాదిలో పోలవరం ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుండడం మాత్రం నిజంగా శుభ పరిణామం.

# త్యాగయ్యలకు దక్కని ఊరట పార్టీలు ఏదైనా అంతే

విజయవాడ, మే 13,

ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు పలు విషయాలను ప్రస్తావిస్తూ.. ట్రోల్స్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా.. పిఠాపురం వర్మకుసంబంధించిన విషయాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా రు. గత 2024 అసెంబ్లీ ఎన్నికలకు ముందు వర్మ సీటును జనసేనకు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ విజయం కోసం.. వర్మ కృషి చేశారు. 70 వేల ఓట్లకు పైగా మెజారిటీతో నాడు.. పవన్ కళ్యాణ్ గెలుపు గుర్రం ఎక్కారు. ఈ క్రమంలో తన టికెట్‌ను త్యాగం చేసిన వర్మకు.. చంద్రబాబు ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ, అనూహ్య, అనివార్య కారణాలతో చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయలేక పోయారన్నది వాస్తవం. ఇక, ఇటీవల నియోజకవర్గం ఇంచార్జ్ బాధ్యతల నుంచి కూడా వర్మను పక్కన పెట్టారు. అయితే.. ఇక్కడే మరో కీలక విషయం ఉంది. పార్టీ ఇంచార్జ్ బాధ్యతల నుంచివర్మను తప్పించినా.. ఆయనకు రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్ష పదవిని ఇచ్చారు. అంటే.. పార్టీ పరంగా వర్మకు ఇంకా మెరుగైన అవకాశమే ఉంది. కానీ, వైసీపీ నాయకులు మాత్రం వర్మకు ఏదో అన్యాయం జరిగిపోయిందని.. చంద్రబాబు మాట ఇచ్చి కూడా తప్పారని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ ఇదే నిజమని అనుకున్నా.. గతంలో వైసీపీ కూ డా ఇలానే చేసిందన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తించాల్సి ఉంటుంది. చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి 2019లో పోటీ చేయాలని భావించిన మర్రి రాజశేఖర్ టికెట్‌ను లాక్కుని విడదల రజనీకి ఇచ్చారు. నిజానికి ఇప్పుడు పిఠాపురం తీసుకోవడం వెనుక టీడీపీకి కూటమి ప్రయోజనాలు ఉన్నాయి. కానీ.. నాడు ఏ ప్రయోజనాలు ఆశించి వైసీపీ మర్రిని త్యాగం చేయాలని పట్టుబట్టింది.? అనే ప్రశ్నకు సమా ధానం లేదు. ఇక, ఆ నాడు.. జగన్ కూడా.. మర్రికి ఎమ్మెల్సీ సహా.. మంత్రి పదవిని కూడా ఆఫర్ చేశారు. నిజానికి చంద్రబాబు వర్మకు మంత్రి పదవి ఇస్తామని చెప్పలేదు. కానీ, ఆనాడు మర్రికి జగన్ మంత్రి పదవి ఇస్తామన్నారు. మరి అధికారంలోకి వచ్చాక ఏం జరిగింది? ఇచ్చారా? అంటే.. నాలుగున్నరేళ్లపాటు మర్రిని ముప్పుతిప్పలు పెట్టారు. చివరకు.. కమ్మ సామాజిక వర్గం ఓట్లు పూర్తిగా డొల్ల అవుతున్నాయని గుర్తించి.. అప్పుడు ఇచ్చారు. సో..నాడు చేసిన విషయాన్ని మరిచిన వైసీపీ ఇప్పుడు టీడీపీకి వంకలు పెడుతుండడమే చిత్రం.

# నవాబ్ పేటలో మంత్రి పొన్నం పర్యటన

కరీంనగర్ జిల్లా

హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురు మామిడి మండలం నవాబ్ పేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు అలసత్వం వద్దని హెచ్చరించారు. ధాన్యం భారీగా వస్తుండడంతో గన్ని బ్యాగ్స్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ప్రతి ఐకేపీ కేంద్రానికి కాంట పూర్తయిన ధాన్యం సంచులు లారీల్లో మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకోవాలి. ఆకస్మిక వర్షం వస్తె ధాన్యం తడవకుండా టార్పాలిన్ అందుబాటులో ఉంచుకోవాలి. ధాన్యం రవాణా తరలింపుకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా ఎంవిఐ అధికారిని నియమించాం. ఎండల్లో హమాలీ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల్లో పంచాయతీ సెక్రటరీ, ఏఈవో, గ్రామ ధాన్యం కొనుగోలు కమిటీ సమన్వయం చేసుకుంటు కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలి అని ఆదేశించారు.

# జిల్లాలో "రైతు పండుగ"ను విజయవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## వ్యవసాయ అనుబంధ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి




కడప, మే 13(భారత శక్తి ): రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, ఉద్యానవన పంటలలో నూతన ఆవిష్కరణలు, మార్కెట్ అవకాశాలను ఒకే వేదికపై పరిచయం చేసే "రైతు పండుగ -- అగ్రి ఇన్నోవేషన్ అండ్ హార్టికల్చర్ ఎక్స్‌పో 2026"ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో ఈ నెల 22-24వ తేదీ వరకు కడపలో నిర్వహించనున్న "రైతు పండుగ -- అగ్రి ఇన్నోవేషన్ అండ్ హార్టికల్చర్ ఎక్స్‌పో 2026" నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధీ మీనా, కేఎంసీ కమిషనర్ హెచ్.ఎస్. భావన లతో కలిసి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే 22 నుండి 24 వరకు మూడు రోజులపాటు కడపలోని మేడా కన్వెన్షన్ సెంటర్‌లో ఈ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, స్టార్టప్ సంస్థలు, వ్యాపార వేత్తలు పాల్గొనే ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే అతిపెద్ద అగ్రి ఙ హార్టికల్చర్ ఎక్స్‌పోగా నిలుస్తుందని పేర్కొన్నారు.

రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరువ చేయడమే లక్ష్యంగా ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ, స్మార్ట్ ఇరిగేషన్, ప్రెసిషన్ ఫార్మింగ్, డ్రైల్యాండ్ అగ్రికల్చర్ టెక్నాలజీస్, సహజ వ్యవసాయం, సమగ్ర వ్యవసాయ విధానాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఉద్యానవన పంటల ఉత్పత్తి, విలువ ఆధారిత ఉత్పత్తులు, సిట్రస్ పంటలు, పసుపు, ఔషధ పంటలు, బయో ఫర్టిలైజర్స్, రక్షిత సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, మష్రూమ్ సాగు, తేనెటీగల పెంపకం వంటి అంశాలపై నిపుణుల మార్గదర్శనం అందించనున్నట్లు వివరించారు.

మూడో రోజు స్టార్టప్‌లు, సాంకేతిక ఆధారిత వ్యవసాయం, వ్యవసాయ ఆర్థిక ప్రణాళికలు, పశుసంవర్ధక రంగంలో టెక్నాలజీ వినియోగం, కోళ్ల పెంపకం, సెరికల్చర్ తదితర అంశాలపై ప్రత్యేక సెషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు మార్కెట్ లింకేజీలు కల్పించేందుకు కొనుగోలుదారులు, డీలర్లు, ఎఫ్‌పీఓలు, వ్యవసాయ ఆధారిత సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు.

ఎక్స్‌పోలో భాగంగా డ్రోన్ స్ప్రేయింగ్, స్మార్ట్ ఇరిగేషన్ సిస్టమ్స్, ప్రెసిషన్ ఫార్మింగ్ టూల్స్, వ్యవసాయ యంత్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, హార్టికల్చర్ ఉత్పత్తులు, సహజ వ్యవసాయ నమూనాలు, అగ్రి స్టార్టప్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని కలెక్టర్ తెలిపారు. యువ రైతులు, మహిళా సంఘాలు, వ్యవసాయ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు.

ఈ ఎక్స్‌పోకు 7,500 మందికి పైగా రైతులు, 100కు పైగా ఎగ్జిబిటర్లు, 250కు పైగా బయ్యర్లు హాజరు కానున్నారని, అలాగే.. డీలర్లు, 25కు పైగా నిపుణుల సెషన్లు ఉంటాయన్నారు. మొత్తం 83 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, అగ్రి ఇన్నోవేషన్ హ్యాకథాన్‌కు రూ.1 లక్షకు పైగా బహుమతులు అందించనున్నట్లు చెప్పారు.

కార్యక్రమానికి వచ్చే రైతులకు తాగునీరు, పార్కింగ్, రవాణా, భద్రత, వైద్య సేవలు, విద్యుత్, పరిశుభ్రత తదితర సౌకర్యాలు సమగ్రంగా కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశిస్తూ ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సిపిఓ హజరతయ్య, స్టెప్ సీఈఓ జోయల్ విజయకుమార్, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, పీఆర్ ఎస్ఈ మద్దన్న, అదనపు డిఏవో అశోక్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, ఎల్డిఎం జనార్ధనం, నాబార్డు డిడిఎం విజయ్ విహారి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.



## బాన్సువాడ ఆర్డిఓ గా బాధ్యతలు చేపట్టిన ఏ. రవీందర్ రెడ్డి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే13: బాన్స్వాడ ఆర్డిఓ గా ఏ రవీందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క అందించారు.

# రామారెడ్డి మండలం గిద్ద-2 గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పాడి కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే13: రామారెడ్డి మండలం గిద్ద-2 గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి వచ్చే 4 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని తెలిపారు.

కలెక్టర్ వెంట సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వర్లు, డిఆర్డీఓ సురేందర్, డిఎమ్ శ్రీకాంత్, ప్రత్యేక అధికారులు, ఎమ్ఈఓ, ఏఓ, తదితరులు పాల్గొన్నారు.

# బైంసా మున్సిపల్ కో-ఆప్షన్ ఎన్నిక వాయిదాపై ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆగ్రహం



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 13(భారత శక్తి) బైంసా మున్సిపల్ కో-ఆప్షన్ ఎన్నికను వాయిదా వేయడంపై ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు.

సోమవారం అర్ధరాత్రి నుంచి బైంసా మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ చైర్మన్ తుమ్మల్ల దత్తాత్రి ఆధ్వర్యంలో బీజేపీ మరియు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు చేపట్టిన నిరాహార దీక్షకు ఎమ్మెల్యే సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోమవారం కలెక్టర్ కో-ఆప్షన్ ఎన్నిక నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారని, మున్సిపల్ కమిషనర్ కూడా మే 12న ఎన్నిక జరుగుతుందని అధికారికంగా తెలిపారని అన్నారు. అయితే రాత్రి వేళ అకస్మాత్తుగా వాట్సాప్ సందేశం ద్వారా ఎన్నిక రద్దు అయినట్లు తెలియజేయడం సరికాదన్నారు.

ఎన్నికను ఎందుకు వాయిదా వేశారో జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. అధికారులు ఎంఐఎం పార్టీకి, ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై ఫిర్యాదు చేయడంతో పాటు ఈ అంశంపై హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. అవసరమైతే అసెంబ్లీలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తానన్నారు.

కో-ఆప్షన్ ఎన్నిక నిర్వహించే వరకు కౌన్సిలర్లు, చైర్మన్ ఆందోళన కొనసాగిస్తారని, వారికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత 18 సంవత్సరాలుగా బైంసా మున్సిపాలిటీని పాలించిన ఎంఐఎం పార్టీకి ఇంకా అధికార దాహం తీరలేదని విమర్శించారు. ప్రజలు తమకు అధికారం ఇచ్చిన నేపథ్యంలో ఎంఐఎం కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి కేవలం రెండు నెలలే అయినప్పటికీ ఎంఐఎం నాయకుల వ్యవహార శైలి సరికాదన్నారు. పాలకవర్గం పిలుపు మేరకు నిర్వహించిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపిన ప్రజలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

ఈ నిరాహార దీక్షలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల్ల దత్తాత్రి, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. వారికి పెద్ద సంఖ్యలో ప్రజలు సంఘీభావం తెలిపారు.

# జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




జిన్నారం మున్సిపల్, మే13 (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లో నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యా వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ఇంటరాక్టు డిజిటల్ ప్యానెల్స్ ను ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యారంగానికి దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలు అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. దీని మూలంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు సైతం దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు.

డిగ్రీ, పీజీ, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రముఖ కార్పొరేట్ కంపెనీలతో క్యాంపస్ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా లక్ష్యంతో చదివి ఉన్నత విజయాలు సాధించాలని విజ్ఞప్తి చేశారు.

జిన్నారం జూనియర్ కళాశాల రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని సూచించారు. కళాశాల అభివృద్ధి కోసం మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలని సంబందిత అధికారులు ఆదేశించారు. కళాశాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

అతి త్వరలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించబోతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్,వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, గడ్డపోతారం మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిన్నారం జి.వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కళాశాల ప్రిన్సిపల్ కృష్ణకుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నిరసన -బిఆర్ఎస్ ఆధ్వర్యంలో వడ్ల బస్తాలు తగలబెట్టిన రైతులు

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 13: నెల రోజులుగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయట్లేదని, కల్లాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా ఆరోపణలు చేస్తూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల బస్తాలను తగలబెట్టి బిఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకుడు కర్రె వెంకటయ్య మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం దిగివచ్చి వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రోజురోజుకు ధాన్యం కొనుగోలు జరిగేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో దాన్యం కొనుగోలు పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాపట్ల నరహరి, గౌడ శ్రీశైలం, రైతులు కర్రె చంద్రశేఖర్, ఒగ్గు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 1 నాటికి స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్వహణలోకి రావాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మే 13(భారత శక్తి ): జిల్లాలోని అన్ని మండలాల్లో ఏర్పాటవుతున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులను జూన్ 1వ తెదీ లోపు పూర్తి చేసి పాఠశాలల పునఃప్రారంభం లోపు నిర్వహణలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కేసి డా. నిధి మీనా, కేఎంసీ కమిషనర్ హెచ్.ఎస్. భావనతో కలిసి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్ గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతిపై సంబంధిత జిల్లా, క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత శుచిగా, రుచికరంగా అందించేందుకు వినూత్నంగా అమలు చేస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ జాతీయ స్థాయిలో అత్యుత్తమ పురస్కారంతో పాటు, ఇతర రాష్ట్రాలకు కూడా స్ఫూర్తినిస్తోందన్నారు. ఈ విధానాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు అన్ని మండలాల్లో వేగవంతంగా నిర్మాణాలను చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించి నిర్మాణ పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు.

ఈ నెల 28 లోపు అన్ని రకాల నిర్మాణ పనులను పూర్త చేసి రెండు రోజులు ట్రయల్ రన్ కూడా నిర్వహించాలన్నారు. వేసవి సెలవులు

వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి జిల్లాలో నిర్మాణంలో ఉన్న అన్ని స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకురావాలన్నారు.

జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులు ఆయా మండలాల్లో వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. ఇందులో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. స్మార్ట్ కిచెన్ లో ఏర్పాటు చేసే పరికరాల కోసం టెండర్, కొనుగోలు, ఆయా పాఠశాలలకు ఫుడ్ ట్రాన్స్ పోర్టేషన్ కు అవసరమైన వాహనాలు మొదలైన అంశాలపై సమీక్షించారు. నిర్మాణం, పరికరాల ఏర్పాటు తదితర అన్ని పనులను జూన్ 1వ తేదీలోపు పూర్తి చేసి కిచెన్ షెడ్స్ ను ట్ తీసుకురావాలన్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడా కూడా జాప్యం జరగకూడదని హెచ్చరించారు.

స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ ఫార్మింగ్ ఏర్పాటుకు ఆయా మండలాల్లో సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. కిచెన్ గార్డెన్స్, కూరగాయల తోటల పెంపకం, కొనుగోలు సంబందిత అంశాలపై ఎపి సీఎన్ఎఫ్, డీఆర్డీఏ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు.

ఈ సమావేశంలో సిపిఓ హజరతయ్య, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, పీఆర్ ఎస్ఈ మద్దన్న, డిఎవో శంశుద్దీన్, నేచరల్ ఫార్మింగ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్, హౌసింగ్ పీడి రాజరత్నం, ఏపీఎస్పీడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాసులు, అదనపు డిఏవో అశోక్




రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, ఎల్డిఎం జనార్ధనం, నాబార్డు డిడిఎం విజయ్ విహారి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, యాంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డిడిబి మదర్ డెయిరీల మధ్య కీలక ఒప్పందం

## - డెయిరీ అభివృద్ధిలో కీలక ముందడుగు

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 13: మదర్ డెయిరీ అభివృద్ధి మరియు పాడి రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు (చీణణదీ) మరియు మదర్ డెయిరీ సంస్థ మధ్య మంగళవారం కీలక ఒప్పందం కుదిరింది. హైదరాబాద్లోని మినిస్టర్స్ క్వార్టర్స్లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు, అలాగే ఎన్డిడిబి సంస్థకు చెందిన సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ శ్రీధర్, సౌత్ రీజినల్ హెడ్ ఆర్మీ జకబ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేష్ కుమార్ పాల్గొని విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం పరస్పర సహకార ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యల సమన్వయంతో పాడి రైతులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, పాల ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు అధికారులు మదర్ డెయిరీ అభివృద్ధి కోసం రూ.10 కోట్ల చెక్కును మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చేతుల మీదుగా మదర్ డెయిరీ ప్రతినిధులకు అందజేశారు. ఈ నిధులతో పాల సేకరణ కేంద్రాల విస్తరణ, శీతలీకరణ కేంద్రాల ఆధునీకరణ, రైతులకు సాంకేతిక సౌకర్యాల కల్పన, పాడి పరిశ్రమ విస్తరణ, అలాగే పెండింగ్లో ఉన్న రైతుల బిల్లుల చెల్లింపులు వంటి



కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా పాడి రైతులకు ఆర్థికంగా మరింత లాభం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, పాడి రైతులు ఆర్థికంగా బలపడాలంటే పాల ఉత్పత్తి రంగాన్ని ఆధునికీకరించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఎన్డిడిబి మరియు మదర్ డెయిరీ మధ్య కుదిరిన ఈ ఒప్పందం రైతులకు ఎంతో మేలు చేస్తుందని, రైతులకు సమయానికి బిల్లులు చెల్లించడం, పాల సేకరణను పెంచడం, ఆధునిక సదుపాయాలు కల్పించడం ద్వారా పాడి రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి యువతకు కూడా ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

# సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బాల సదన్ భరోసా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

## -విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి: న్యాయమూర్తి బి.సౌజన్య

సంగారెడ్డి జిల్లా మే 13(భారత శక్తి న్యూస్):

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల ప్రకారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న బాల సదన్, భరోసా కేంద్రాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి బి.సౌజన్య ఆకస్మిక తనికి నిర్వహించటం జరిగినది. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి




న్యాయమూర్తి బి.సౌజన్య మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి అన్నారు. నిర్వాహకులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సంరక్షణకు తోడ్పడాలని,అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి అని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా చిన్నారి పిల్లల పట్ల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి అన్నారు, చిన్నారి విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండి, గ్రామీణ ప్రాంత ప్రజలు నేటి సమాజంలో చట్టాలపై అవగాహన పెంచుకోవాలి అని అన్నారు. భరోసా కేంద్రాన్ని సందర్శించే బాధితులకు న్యాయపరమైన విషయాలలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఎవరికైనా న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అవసరం ఉన్నచో అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించగలరు, అన్నారు. ఈ కార్యక్రమంలో బాలసదన్, భరోసా కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ ఇంధన పొదుపు పిలుపు

న్యూ ఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, మే 13:

అసాధారణం కాదు, ప్రపంచ అవసరం

ఈ ప్రపంచ సంక్షోభ సమయంలో, చాలా దేశాల ప్రభుత్వాలు ప్రజలను ఖర్చులు తగ్గించమని, ప్రయాణాలు తగ్గించమని, ఇంధనాన్ని ఆదా చేయుమని తరచూ కోరుతున్నాయి. ప్రధాని మోదీ చేసిన నియంత్రణ పాటించాలనే పిలుపు కూడా ఇదే ప్రపంచవ్యాప్త ధోరణిలో భాగం. చాలా దేశాలు కేవలం విజ్ఞప్తులతో ఆగిపోలేదు. 2026 చమురు సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఇంధన రేషన్ విధానం, తప్పనిసరి వర్క్ ఫ్రం హోమ్, ఇంధన వినియోగ పరిమితులు, వేగ పరిమితులు తగ్గించడం, ప్రయాణాలపై ఆంక్షలు లాంటి నిబంధనలు అమలు చేస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న పరిస్థితి

- ప్రపంచ ఇంధన సంక్షోభాలకు ప్రతిస్పందనగా, సుమారు 40 దేశాలు తీసుకున్న అత్యవసర ఇంధన పొదుపు చర్యలను ×జూా ట్రాకర్ నమోదు చేసింది. యూరోపియన్ కమిషన్ కూడా ఇందులో భాగమైంది.

- 40కి పైగా దేశాలు ఇంధన వినియోగం, రవాణా నియంత్రణపై చర్యలు చేపట్టాయి.

-అభివృద్ధి చెందిన దేశాలు ఎక్సైజ్ సుంకాల్లో కోతలు, ప్రభుత్వ ఆర్థిక సహాయ విధానాలు, అధిక ధరల వసూళ్లపై హెచ్చరికలు, రవాణా, వ్యవసాయం, ఎక్కువగా ప్రయాణించే వర్గాలకు ప్రత్యేక ఉపశమన చర్యలు తీసుకొచ్చాయి.

- 3 దేశాలు వంటనూనె, ూా+ వినియోగం తగ్గించేందుకు నేరుగా చర్యలు అమలు చేశాయి. అందులో రేషన్ విధానం, సిలిండర్లను సగం మాత్రమే నింపడం, విద్యుత్ లేదా ూచీ+ ప్రత్యామ్నాయాలకు మార్పు వంటి నిర్ణయాలు ఉన్నాయి.

- 18 దేశాలు రవాణా వినియోగం తగ్గించే వ్యూహాలను అమలు చేశాయి. అందులో ఇంధన రేషన్ లేదా పరిమితులు, వాహనాలను ప్రత్యామ్నాయ రోజులలో నడపడం, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్, కార్పూలింగ్ ప్రోత్సాహం, వ్యక్తిగత లేదా ప్రభుత్వ వాహనాలపై పరిమితులు, జుఎలకు ప్రోత్సాహకాలు ఉన్నాయి.

- 13 దేశాలు ముఖ్యంగా ప్రభుత్వ రంగంలో వర్క్ ఫ్రం హోమ్, రిమోట్ వర్క్ విధానాలను ప్రోత్సహించాయి.

- దాదాపు అన్ని దేశాలు --- అంటే 35కి పైగా దేశాలు --- ప్రజా ప్రచారాలు, కూలింగ్-లైటింగ్ వినియోగ పరిమితులు, ప్రభుత్వ ప్రయాణాల నియంత్రణ, సాధారణ ఇంధన సామర్థ్య కార్యక్రమాల ద్వారా ఇంధన వినియోగం



తగ్గించే విస్తృత చర్యలు ప్రారంభించాయి.

అనుబంధం: ఎంపిక చేసిన అత్యవసర ఇంధన పొదుపు చర్యలు1

1. వర్క్ ఫ్రం హోమ్ / సౌకర్యవంతమైన పని విధానాలు:

చాలా దేశాలు ఉద్యోగుల ప్రయాణాలు తగ్గించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు రిమోట్ వర్కు ప్రోత్సహిస్తున్నాయి లేదా తప్పనిసరి చేస్తున్నాయి. ప్రైవేట్ రంగంలో కూడా అదే విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఉదాహరణలు:

- పాకిస్తాన్ (వారం 4 రోజుల పని విధానం ం 50% రిమోట్ పని)
- ఇండోనేషియా (శుక్రవారాల్లో వర్క్ ఫ్రం హోమ్)
- శ్రీలంక (బుధవారాల్లో కార్యాలయాలు మూసివేత)
- కొరియా (సౌకర్యవంతమైన పని విధానాలు)
- కంబోడియా
- లావో్ాణ=
- మలేషియా
-ఫిలిప్పీన్స్
- థాయ్లాండ్
- వియత్నాం, పెరూ, ఈజిప్ట్.

2. కూలింగ్ / ఏసీ పరిమితులు:

విద్యుత్ పొదుపు కోసం కార్యాలయాలు, ప్రభుత్వ భవనాల్లో ఉష్ణోగ్రత పరిమితులు నిర్ణయించారు.

ఉదాహరణలు:

-బంగ్లాదేశ్ (25°C)
- సింగపూర్ (25°C, ఫ్యాన్ల వినియోగానికి ప్రాధాన్యం)
- కంబోడియా (24--25°C)
- మలేషియా (24°C)
- శ్రీలంక (26°C)
- థాయ్లాండ్ (26°C)
-జోర్డాన్ (ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీ నిషేధం).

3. ప్రభుత్వ ప్రయాణాలపై పరిమితులు:

ప్రభుత్వ అధికారుల విమాన ప్రయాణాలు, రోడ్డు ప్రయాణాలు, విదేశీ పర్యటనలపై నియంత్రణలు విధించారు.

ఉదాహరణలు:

-జోర్డాన్ (తాత్కాలిక నిషేధం)
-పాకిస్తాన్ (విదేశీ ప్రయాణాల నిషేధం)
-ఈజిప్ట్
-ఇండోనేషియా
-మలేషియా
- కొరియా (ప్రభుత్వ రంగంలో ఆడ్-ఈవెన్ విధానం)
- పనామా
- టాంజానియా (సామూహిక బస్సు ప్రయాణాలు).

4. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు:

పాఠశాలలు, యూనివర్సిటీలను మూసివేయడం, పని వారాన్ని తగ్గించడం, ఆన్లైన్ బోధనకు మార్పు వంటి చర్యలు చేపట్టారు.

ఉదాహరణలు:

-బంగ్లాదేశ్ (విశ్వవిద్యాలయాల మూసివేత)
- శ్రీలంక (బుధవారాలకు సెలవు)
- లావో్ాణ= (వారానికి 3 రోజులకే పరిమితం)
- పాకిస్తాన్ (100% ఆన్లైన్ బోధన)
-పెరూ

5. ప్రజా ప్రచారాలు, ఆదేశాలు:

విద్యుత్ వినియోగం, లైటింగ్, పరికరాల వాడకం వంటి విషయాల్లో ఇంధనాన్ని ఆదా చేయాలని వినియోగదారులు, వ్యాపారాలు, కార్యాలయాలను ప్రోత్సహించే కార్యక్రమాలు దాదాపు అన్ని దేశాల్లో విస్తృతంగా అమలయ్యాయి.

ఉదాహరణలు:

- ఆస్ట్రేలియా ("ప్రతి చిన్న పొదుపు కూడా ఉపయోగమే")

-కంబోడియా -- ప్రభుత్వ విద్యుత్ సంస్థ ప్రజలను విద్యుత్ వినియోగం తగ్గించమని కోరడం

- కొరియా -- ప్రాయోగిక పొదుపు చర్యలపై ప్రజా ప్రచారం

-సింగపూర్ -- ప్రజలను ఇంధన పొదుపు చేయమని, సమర్థవంతమైన పరికరాలు వాడమని విజ్ఞప్తి, వ్యాపార సామర్థ్య గ్రాంట్లు అన్ని రంగాలకు విస్తరించడం, "లెట్స్ సేవ్ ఎనర్జీ టుగెదర్" ప్రచారం ప్రారంభించడం, క్లైమేట్ వౌచర్ పథకం ప్రోత్సాహం

- నెదర్లాండ్స్ -- జాతీయ చమురు సంక్షోభ ప్రణాళిక తొలి దశ ప్రారంభం, గృహాలు, వ్యాపారాల కోసం లక్ష్యిత సామర్థ్య ప్యాకేజీ అమలు, సౌర ప్యానెల్స్, గ్యాస్ బాయిలర్లను హీట్ పంప్లో మార్పు, గృహ రిట్రోఫిట్స్

- పాకిస్తాన్ -- స్థానిక ప్రభుత్వాలను ఇంధన పొదుపు చేయమని ఆదేశాలు, అధికారిక విందులు రద్దు, భౌతిక సమావేశాలు రద్దు, మార్కెట్లు, వాణిజ్య కేంద్రాలు రాత్రి 8 గంటలకు మూసివేత, ఆహార కేంద్రాలు, ఈవెంట్ ప్రదేశాలు రాత్రి 10 గంటలకు మూసివేత

- మడగాస్కర్ -- దేశవ్యాప్తంగా 15 రోజుల ఇంధన అత్యవసర పరిస్థితి ప్రకటన

-స్పెయిన్ -- గృహాల పునరుద్ధరణ, సౌర శక్తి స్థాపన, విద్యుతీకరణ చర్యలపై వ్యక్తిగత ఆదాయ పన్ను తగ్గింపు

- థాయ్లాండ్ -- కార్యాలయ ఉద్యోగులను ఇంధన వినియోగం తగ్గించమని విజ్ఞప్తి (మెట్లు వాడడం, పరికరాలు ఆఫ్ చేయడం వంటి చర్యలు), గ్రామీణ ప్రాంతాల్లో వీధి లైటింగ్ తగ్గింపు

-యునైటెడ్ కింగ్డమ్ -- గ్యాస్, ఆయిల్ ఆధారిత హీటింగ్ నుండి హీట్ పంప్స్, గృహ రిట్రోఫిట్ చర్యలకు మారేందుకు గృహాలకు గ్రాంట్ పెంపు

-వియత్నాం -- స్థానిక ప్రభుత్వాలను ఇంధన పొదుపుకు సహకరించమని విజ్ఞప్తి

6. రవాణా, ఇంధన చర్యలు:

ఇంధన రేషన్ విధానం, బేసి-సరి నియమాలు, వేగ పరిమితులు, ప్రజా రవాణా, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, బయోఫ్యూయల్ మిశ్రమాలు వంటి చర్యలు అమలు చేస్తున్నారు.

ఉదాహరణలు:

- కొరియా ( సరి - బేసి వాహన రహిత రోజులు)
- శ్రీలంక (క్యూర్ కోడ్ ఆధారిత ఇంధన రేషన్ విధానం)
-మయన్మార్ (ప్రత్యామ్నాయ రోజుల్లో వాహన వినియోగం, ఈవీ మార్పిడి ప్రోత్సాహం)

# బ్లాక్ మార్కెట్లో వంట గ్యాస్.!

**-ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్ళు, రెస్టారెంట్ల నిర్వాహకులు రహస్య కొనుగోలు**
**-అధికంగా సొమ్ము చేసుకుంటున్న గ్యాస్ ఏజెన్సీ దళారులు**
**-గృహ అవసరాలకు దొరకని డొమెస్టిక్ సిలెండర్లు.!**
**-మామూళ్ల మత్తులో సివిల్ సప్లయ్ అధికారులు.!**
**-బ్లాక్ మార్కెట్ ను దమ్ముంటే పట్టుకోండి.! -సవాల్ విసిరిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు**








భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 13(భారతశక్తి): పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం కొందరికి వంటింటి కష్టాలు తెచ్చి పెడుతోంటే.. గ్యాస్ సరఫరా డీలర్లకు కాసులు కురిపిస్తోంది. అక్రమంగా విక్రయించేందుకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రహస్య ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్యాస్ కొరతను బూచిగా చూపుతూ రహస్య ప్రాంతాల్లో పెట్టిన సిలిండర్లను బ్లాక్ మార్కెట్ కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యుల పేరుతో గ్యాస్ బుక్ చేసి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్ళు, రెస్టారెంట్లకు అధికధరలకు విక్రయిస్తున్నారు. సామాన్యులు గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత ఓటిపిలు వచ్చిన తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో గ్యాస్ కష్టాలు వస్తాయోమే అని ప్రజలు ఇంట్లో గ్యాస్ కడ దశకు రాకముందే స్టాక్ పెట్టుకునేందుకు ముందస్తుగా బుకింగ్ లు చేసుకుంటున్నారు. దీని వలన సాధారణ బుకింగ్ ఒక్కసారిగా 40 నుండి 50 శాతం పెరిగింది. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం నియంత్రణ కోసం ఒక సిలెండర్ బుకింగ్ తర్వాత రెండో సిలెండర్ బుకింగ్ చేయాలంటే 45 రోజుల వ్యవధి తర్వాత బుకింగ్ అనే నిబంధనలు తీసుకువచ్చారు. 45 రోజుల తర్వాత బుకింగ్ చేసిన ఓటిపిలు వస్తేనే గ్యాస్ డెలివరీ ఇస్తామని డీలర్లు చెపుతున్నారు. ఓటిపి చెప్పిన గ్యాస్ కొరత ఉంది టైమ్ పడుతుందంటూ.. వారికి ఇచ్చే డొమెస్టిక్ సిలెండర్లు బ్లాక్ మార్కెట్ ద్వారా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్ళు, రెస్టారెంట్లకు డబుల్, ట్రిబుల్ రేట్లకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు గ్యాస్ డెలివరీ అవ్వక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**బ్లాక్ మార్కెట్లో అవసరాన్ని బట్టి ధర**

గృహ వినియోగానికి అవసరమయ్యే ఒక్కో సిలిండర్ సాధారణ ధర మణుగూరులో రూ.980 ఉంటే.. ప్రస్తుతం అవసరాన్ని బట్టి రూ.2,000ల నుంచి రూ.3 వేలకు విక్రయిస్తున్నారు. కమర్షియల్ సిలిండర్ రూ.4,500కు పైగా పలుకుతోంది. అధిక ధరలైనా కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే అదనుగా భావిస్తున్న కొన్నిగ్యాస్ ఏజెన్సీలు, సరఫరా డీలర్లు బ్లాక్ మార్కెట్లో భారీగా దోపిడీచేస్తున్నారు. మరోవైపు అత్యవసర పరిస్థితుల్లో గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ సరఫరా వ్యవస్థలో కొన్ని ఏజెన్సీలు శాసించే స్థాయికి చేరాయి. ఫలితంగా గ్యాస్ ఏజెన్సీల అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్న ఆరోపణలున్నాయి.

**దమ్ముంటే పట్టుకోండి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీలో కనకదుర్గ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో కమర్షియల్ సిలెండర్ వడాల్సి ఉండగా డొమెస్టిక్ సిలెండర్ వినియోగిస్తున్నారు. ఈ విషయంపై వారిని ప్రశ్నించగా కమర్షియల్ సిలెండర్ ధర రూ.4500లకు విక్రయిస్తున్నారని ఫాస్ట్ ఫుడ్ నిర్వాహకుడు చెపుతున్నారు. అదే డొమెస్టిక్ అయితే రూ.2వేలు నుండి రూ.2500లకు దొరుకుతుందని తెలిపారు. కావాలంటే మీకు దమ్ముంటే బ్లాక్ లో గ్యాస్ అమ్మే వారిని పట్టుకొని డబుల్, ట్రిబుల్ ధరలకు విక్రయించకుండా చూడాలని సవాల్ విసిరారు. సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలకు రాకుండా గ్యాస్ డీలర్లు నెల వారి మామూళ్లు ఇస్తున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో, హోటల్లో, రెస్టారెంట్లో డొమెస్టిక్ సిలెండర్లు వినియోగిస్తున్నారని సివిల్ సప్లయ్ అధికారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు విసిరిన సవాళ్లను అధికారులు సీరియస్ గా తీసుకుంటారా.? లైట్ తీసుకుంటారా.? వేచిచూద్దాం.

## జీనియస్ వరల్డ్ రికార్డ్స్ లో శృతి ప్రియ ప్రతిభ

మణుగూరు, మే 13 (భారతశక్తి): మున్సిపాలిటీ పరిధిలోని మోంటిసోరి పాఠశాలకు చెందిన విద్యార్థిని జీనియస్ వరల్డ్ రికార్డ్స్ లో ప్రతిభ చాటింది. పట్టణంలోని ప్రియా టెంట్ హౌస్




యజమాని సురేష్ కుమార్తె శృతి ప్రియా స్థానిక మోంటిసోరి పాఠశాలలో చదువుతోంది. ఫిబ్రవరి 2న విజయవాడలోని ఓ మ్యూజిక్ స్కూల్లో వివిధ దేశాల నుంచి రెండు వేల మంది కీబోర్డు వాయిద్య కళాకారులు ఏకకాలంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన గిన్నిస్ రికార్డు సాధించింది. ఈ కార్యక్రమంలో ప్రతిభధ్రువపత్రాలను అందించారు. శుక్రవారం మ్యూజిక్ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండంగి నుంచి శృతి ప్రియా ధ్రువపత్రం అందుకున్నారు.

## బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు (భారత శక్తి ప్రతినిధి) మే 13 :

చాపాడు మండలం విశ్వనాథపురం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించిన హనుమాన్ జయంతి మహోత్సవాలలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఎమ్మెల్యే రాక సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కార్తిక్ రెడ్డి ఎమ్మెల్యే కి శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.అనంతరం గ్రామీణ సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఎద్దుల బండ లాగుడు పోటీలను ఎమ్మెల్యే గారు ప్రారంభించారు. పోటీలలో పాల్గొన్న యువకులను అభినందిస్తూ, గ్రామీణ సంస్కృతి మరియు సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గండి క్షేత్రానికి నూతన వైభవం:

-రూ.28 కోట్లతో పునర్నిర్మాణం

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా గండి క్షేత్రాన్ని తీర్చిదిద్దుతాం

అర్చకులకు బాసటగా.., పారదర్శక పాలన

వైయస్సార్ కడప జిల్లా,మే 13(భారత శక్తి ):పాపాఘ్ని నదీ తీరాన వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి శ్రీ వీరాంజనేయ స్వామి



వారి ఆలయం అత్యంత పవిత్రమైనదని, పురాణాల ప్రకారం శ్రీరామచంద్రుడే స్వయంగా ఈ స్వామి విగ్రహాన్ని మలిచారనే ప్రతీతి ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

చక్రాయిపేట మండలం మారెళ్ళమడక గ్రామంలో హనుమత్ జయంతి ఉత్సవాల సందర్భంగా గండి శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులు అత్యంత వైభవంగా పూర్తయిన నేపథ్యంలోనిర్వహించిన కుంభాభిషేక మహోత్సవానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ముందుగా గండి క్షేత్రానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

అనంతరం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయనరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి కావడంతో గండి క్షేత్రం నూతన శోభ సంతరించుకుందన్నారు.

గండి ఆలయ పునర్నిర్మాణం, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం మొత్తం రూ. 28.05 కోట్లు వెచ్చించిందని తెలిపారు. ఇందులో దేవాదాయ శాఖ నుండి రూ. 23.49 కోట్లు కాగా, ఆలయ నిధుల నుండి మరో రూ. 4.56 కోట్లు వినియోగించామన్నారు. ప్రస్తుతం ఆలయానికి ఏటా రూ. 5.62 కోట్ల ఆదాయం వస్తుండగా, స్వామి వారి పేరిట రూ. 9.47 కోట్లు ఫిక్సెడ్ డిపాజిట్ల రూపంలో భద్రంగా ఉన్నాయన్నారు. భక్తుల సౌకర్యార్థం వైదిక విలువల ప్రకారం నిర్మించిన ఈ ఆలయం, రాబోయే రోజుల్లో భక్తులకు సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతిని అందించనుందనీ అన్నారు.

గండి క్షేత్రాన్ని భవిష్యత్తులో దేశంలోనే ఒక గొప్ప ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలోని దేవాలయాలన్నింటికీ పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అందుకు అనుగుణంగా భారీ ప్రణాళికలను అమలు చేస్తోందన్నారు. కామన్ గుడ్ ఫండ్ కింద రాష్ట్రవ్యాప్తంగా 706 ఆలయాల అభివృద్ధి పనుల కోసం రూ. 832 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కేవలం పెద్ద ఆలయాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లోని 5,000 భజన మందిరాల నిర్మాణం కోసం రూ. 750 కోట్లు కేటాయించామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మొదటి విడతలో 679 మందిరాల నిర్మాణానికి రూ. 113 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ భజన మందిరాల నిర్మాణానికి భూమి విస్తీర్ణాన్ని బట్టి 5 సెంట్ల భూమికి 20 లక్షల రూ.

10 సెంట్ల భూమికి 30 లక్షల రూ.

20 సెంట్ల భూమికి 40 లక్షల రూ. నిధులు అందజేస్తున్నామన్నారు.

ఆలయాల్లో నిత్యం ధూప దీప నైవేద్యాలు సక్రమంగా జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 6,170 ఆలయాలకు ప్రతి నెలా ఒకటో తేదీనే రూ. 10,000 చొప్పున నిధులను నేరుగా అర్చకుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తూ, ఇందుకోసం రూ. 74.04 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు జిల్లాలో 822 ఆలయాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయన్నారు.జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఈ ఆలయాలకు నెలకు 9.86 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందుతోందన్నారు.అలాగే జిల్లాలో 63 ఆలయాల అభివృద్ధికి 53.36 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు.జిల్లా వ్యాప్తంగా 79 భజన మందిరాల కోసం 12.95 కోట్లు విడుదలయ్యాయన్నారు.గత ప్రభుత్వాల వలె కాకుండా, పాత కమిటీల పదవీకాలం ముగిసే వరకు వేచి చూసి, ప్రజాస్వామ్యబద్ధంగా కొత్త కమిటీలను ప్రభుత్వం నియమిస్తున్నట్లు తెలిపారు.పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, గండి ఆలయ నూతన కమిటీ నియామకాన్ని కూడా వివాదరహితంగా చేపట్టడం జరిగిందన్నారు.ధర్మకర్తల మండళ్లకు సంబంధించి ఇప్పటివరకు 956 ఆలయాలకు కొత్త పాలక వర్గాలను నియమించామన్నారు.

హిందూ సనాతన ధర్మాల పరిరక్షణకు, ఆలయాల ప్రక్షాళనకు,దేవాలయాల పూర్వ వైభవానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.భక్తుల దర్శనార్థం బుధవారం నుండి గండి శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయం అందుబాటులోకి వస్తుందనీ భక్తులందరూ తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.హెచ్. ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, , శ్రీనివాసులరెడ్డి, భూకేష్ రెడ్డి,ఆలయ చైర్మన్ కల్లూరి వేంకట స్వామి, దేవాదాయశాఖ అధికారులు,నాయకులు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో పాఠశాల విద్యార్థుల కోసం యంగ్ ఎంటర్ ప్రెన్యూర్స్ ప్రోగ్రామ్

సంగారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) మే 13 :

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని వెంచర్ డెవలప్ మెంట్ సెంటర్ (వీడీసీ) 8 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం మూడు రోజుల యంగ్ ఎంటర్ ప్రెన్యూర్స్ ప్రోగ్రామ్ (వైఎల్పీ) స్టార్టప్ బూట్ క్యాంపును నిర్వహించనుంది. ఈ కార్యక్రమం అనుభవపూర్వక, కార్యాచరణ-ఆధారిత అభ్యాసం ద్వారా యువ అభ్యాసకులలో వ్యవస్థాపక ఆలోచనా విధానం, సృజనాత్మకత, నాయకత్వం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో పాల్గొనేవారు ఆరు వేల రూపాయలతో పాటు జీఎస్టీని కూడా చెల్లించాల్సి ఉంటుంది.వైఎల్పీ ఒక ప్రాక్టికల్, పూర్తిగా లీనమయ్యే బ్యూట్ క్యాంపు. ఇది విద్యార్థులకు అవకాశాలను గుర్తించడం, వినూత్న ఆలోచనలను అభివృద్ధి చేయడం, స్టార్టప్ వ్యవస్థాపకుల వలె పరిష్కారాలను కనుగొనడంలో సహాయపడటం ద్వారా, వారికి వ్యవస్థాపకత యొక్క ప్రాథమిక అంశాలను పరిచయం చేస్తుంది. సాంప్రదాయ తరగతి గది అభ్యాసానికి భిన్నంగా, ఈ కార్యక్రమం బృంద ఆధారితమైన, ముఖాముఖిగా కొనసాగి, ఆచరణాత్మక అనుభవంపై దృష్టి పెడుతుంది.వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి ప్రపంచంలో వ్యవస్థాపక నైపుణ్యాల ప్రాముఖ్యతను చాటిచెబుతూ, భవిష్యత్ విజయానికి విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, భావప్రకటన, దృఢత్వం, ఆవిష్కరణ వంటి లక్షణాలు అత్యవసరం అయ్యాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రారంభ దశలోనే ఆయా నైపుణ్యాలను సమకూర్చి, వారిని ఆత్మవిశ్వాసం కలిగిన నాయకులుగా, మార్పు తీసుకువచ్చే వారిగా తీర్చిదిద్దేలా రూపొందించారు.ఈ మూడు రోజుల బ్యాట్ క్యాంపులో వ్యవస్థాపక మనస్తత్వం, అవకాశాలను గుర్తించడం, డిజైన్ థింకింగ్, వ్యాపార నమూనాలు, వినియోగదారులను అర్థం చేసుకోవడం, స్టార్టప్ ఆలోచనను అభివృద్ధి చేయడం, కథ చెప్పడం, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, పిచింగ్ టెక్నిక్ లను వివరించే ఒక క్రమబద్ధమైన పాఠ్యప్రణాళికతో సాగనుంది.తొలి రోజున, విద్యార్థులు వ్యవస్థాపక మనస్తత్వం, వాస్తవ ప్రపంచ సమస్యలను గుర్తించడం, డిజైన్ థింకింగ్, బృంద ఏర్పాటు, ఆలోచనల మథనం వంటి అంశాలపై జరిగే సెషన్ల ద్వారా 'వ్యవస్థాపకుడిగా యోచించడం' నేర్చుకుంటారు. 'మీ ఆలోచనను రూపొందించుకోండి' శీర్షికన జరిగే రెండవ రోజు సెషన్, వ్యాపార నమూనాలను అర్థం చేసుకోవడం, వినియోగదారుల అవసరాలు, స్టార్టప్ ఆలోచనలను మెరుగుపరచడం, ఒక సరళమైన స్టార్టప్ కాన్వాస్ ను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తుంది. ఇక మూడవ రోజు, 'ఆత్మవిశ్వాసంతో ఏర్పాటు చేయండి' అనే కార్యక్రమంలో పాల్గొనేవారికి కథ చెప్పడం, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, ప్రశ్నలను ఎదుర్కోవడం, 'షార్క్ ట్యాంక్'-శైలి పిచ్ సెషన్లో ఒక ప్యానెల్ ముందు తమ స్టార్టప్ ఆలోచనలను ప్రదర్శించడం వంటి అంశాలలో శిక్షణ ఇస్తారు.ఈ కార్యక్రమం ముగిసేనాటికి, ఇందులో పాల్గొనేవారు వ్యవస్థాపక మనస్తత్వం, మెరుగైన విమర్శనాత్మక ఆలోచనా సామర్థ్యాలు, జట్టు కృషి, సహకార నైపుణ్యాలు, బహిరంగ ప్రసంగంలో ఆత్మవిశ్వాసం, ఇంకా బూట్ క్యాంప్ సమయంలో అభివృద్ధి చేసిన ఒక క్రమబద్ధమైన స్టార్టప్ ఆలోచనను పొందుతారు. అలాగే దీనిని విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులు గీతం వీడీసీని నుంచి ఒక ధ్రువీకరణ పత్రాన్ని కూడా అందుకుంటారు.స్టార్టప్ లు, ఆవిష్కరణలు, వ్యాపారం, సృజనాత్మక సమస్య పరిష్కారం, నాయకత్వం, భావప్రకటనా నైపుణ్యాలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపకరిస్తుంది. అంతే కాకుండా, ఇది యువ అభ్యాసకులకు విశ్వవిద్యాలయ ప్రాంగణ జీవితంపై విలువైన అవగాహనను, గీతం వీడీసీతో అనుబంధం ఉన్న నిపుణుల నుంచి మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. మరిన్ని వివరాల కోసం వీడీసీ ఉప సంచాలకుడు మహేష్ వారియర్ ౦91 9036217587ను, లేదా mvarier@gitam.edu కు ఈ-మెయిల్ చేయడం ద్వారా గానీ సంప్రదించవచ్చు.

# విబి జి రామ్ జి.ఓ 2025 రద్దు చేయాలి

## -పని ప్రదేశంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి.
## -రెండు సార్లు ఫోటో క్యాప్చర్ విధానాన్ని రద్దు చేయాలి.
## -ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య



మెదక్ జిల్లా నర్సాపూర్, మే 13 (భారత శక్తి న్యూస్) :తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐఏ డబ్ల్యాయు)ఆధ్వర్యంలో నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, పెద్ద చింతకుంట, చిన్న చింతకుంట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పని ప్రదేశాలను సందర్శించి కూలీలతో సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఎన్ పి ఆర్ డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య, సిఐటియుజిల్లా ఉపాధ్యక్షులు కె.నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తుందని అన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజులు పని కల్పించాల్సి ఉన్నప్పటికీ ఎక్కడ కూడా 100 రోజులు పని కల్పించడం లేదని అన్నారు. వి బి జి రామ్ జి పేరుతో ఉపాధి కూలీల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతం నిధులు ఖర్చు చేయాలని నిర్ణయం చేయడం అంటే రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారం పెరుగుతుందని అన్నారు.125 రోజులకు పని దినాలు పెంచుతున్నామని చెప్తున్నా ప్రభుత్వం 60 రోజులు పని చేయకుండా నిషేదాన్ని విధించడం జరిగిందని అన్నారు. రెండు సార్లు ఫోటో క్యాప్చర్ విధానాన్నిరద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద చింతకుంట,చిన్న చింతకుంట, రెడ్డి పల్లి గ్రామాల్లో పని ప్రదేశాల్లో టెంట్, వాటర్, మెడికల్ కిట్ సౌకర్యం లేదని అన్నారు.పని చేసినప్పటికి వేతనాలు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. రోజు కూలీ 303 రూపాయలు రావాల్సి ఉన్నప్పటికీ ఎక్కడ కూడా 303 రావడం లేదని అన్నారు. ఎండలో పని చేస్తున్న కూలీలకు చేతులకు బొబ్బలు వస్తున్నాయని అన్నారు.పెద్ద చింతకుంట,చిన్న చింతకుంట, రెడ్డి పల్లి గ్రామాల్లో కొద్దీ మంది కూలీలకు గత సంవత్సరం పని చేసిన వారికి వేతనాలు రాలేదని అన్నారు.ప్రతి వారం కూలీలకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న కఠినమైన విధానాల వలన పనికి హాజరయ్యే కూలీల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతుందని అన్నారు.పని ప్రదేశాలను అధికారులు సందర్శించడం లేదని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయించడంలో కీలకంగా ఉన్న మెట్లకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు జారీ చేసి పని కల్పించాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు కలిగిన వారికి పని కల్పించకుంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలని చట్టంలో ఉంటే ఎందుకు అమలు చేయడం లేదని అన్నారు.గడ్డపార, గంపలు, పారలు ఉచితంగా పంపిణి చేయాల్సి ఉన్న ఎక్కడ కూడా పంపిణి చేయడం లేదని అన్నారు.దూర ప్రాంతం వెళ్లి పని చేస్తే రవాణా చార్జీలు చెల్లించాలని చట్టంలో ఉందని అన్నారు.పాత పద్ధతిలోనే నరేగా ను కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పథకంలో వస్తున్న సమస్యలు పరిష్కారం చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, రెండు సార్లు ఫోటో క్యాప్చర్విధానాన్ని రద్దు చేయాలని, పని ప్రదేశంలో టెంట్, వాటర్, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణి చేయాలని డిమాండ్ చేస్తూ మే 15న నర్సాపూర్ ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ సమావేశాల్లో చిన్న చింతకుంట,పెద్ద చింతకుంట, రెడ్డిపల్లి గ్రామాల ఉపాది కూలీలు శివయ్య, అమృత, కిష్టమ్మా,బాలయ్య, పోచయ్య,రాజు,నగేష్,శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

# సాధించాలనే పట్టుదల ఉన్న వారిని ప్రోత్సహిస్తాం: మంత్రి గడ్డం వివేకానంద



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 13 ( భారత శక్తి ) : ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ఉన్న వారిని ప్రోత్సహిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో టామ్ కామ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ కుమార్, టామ్ కామ్ సంస్థ మేనేజర్ అనిల్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ సరైన విద్య, నైపుణ్యత కలిగిన వారికి విదేశాలలో మంచి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విదేశాలలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సరైన అర్హత కలిగిన వారికి ఆయా దేశాల భాష నేర్పించి ఉపాధి కల్పించడంలో టామ్ కామ్ సంస్థ మంచి పని చేస్తుందని తెలిపారు. జర్మనీ, జపాన్, ఇజ్రాయిల్ దేశాలతో పాటు గ్రీస్, యూరోప్ వంటి దేశాలలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యత, అనుభవం కలిగిన వారి కొరకు ఆయా దేశాలు సంప్రదిస్తున్నాయని తెలిపారు. అర్హత, నైపుణ్యత గల వారికి ఆయా దేశాలలో వారానికి 35 గంటల పని ఉంటుందని, దాదాపు 2 లక్షల రూపాయల వరకు వేతనం వస్తుందని తెలిపారు.ఈ క్రమంలో యువతకు ఉపాధి కల్పించడంలో మందమర్రి ప్రాంతంలో శిక్షణ కేంద్రం ప్రారంభించడం సంతోషంగా ఉందని, జూన్ 10వ తేదీ నుండి ఉదయం 4 గంటలు, సాయంత్రం 4 గంటలు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నర్సింగ్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ వంటి అనేక రంగాలలో నైపుణ్యత గల అభ్యర్థుల కోసం అవకాశాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం టామ్ కామ్ సంస్థకు 90 కోట్ల రూపాయలు అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మందమర్రి నుండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తరువాత బ్యాచ్ కు ఆదర్శంగా మారాలని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు వెళ్లాలని, చిత్తశుద్ధితో పనిచేసి డబ్బులు సంపాదించుకోవాలని, మనతో పాటు మరింత మందికి అభివృద్ధి చెందే అవకాశం కల్పించి చేయూత అందించాలని తెలిపారు. మనం కష్టపడి సంపాదించి ఖర్చు పెడితే గౌరవం ఉంటుందని, మన కుటుంబాన్ని సక్రమంగా చూసుకోవచ్చని తెలిపారు. పారిశ్రామిక శిక్షణా సంస్థ, సింగరేణి సంస్థల ద్వారా అనేక మంది శిక్షణ పొంది, అప్రెంటిస్ పూర్తి చేసి అనుభవం పొందుతున్నారని, ఏకాగ్రతతో విదేశీ భాషను నేర్చుకొని విదేశాలలో పనిచేసే అవకాశం సంపాదించుకోవాలని తెలిపారు. ఈ క్రమంలో విదేశాలలో ఉన్న అవసరాలకు అనుగుణంగా అర్హత, ఆసక్తి గల అభ్యర్థులకు శిక్షణ అందించడం జరుగుతుందని, యువత తమ వివరాలను నమోదు చేసుకొని శిక్షణ పొందాలని తెలిపారు. ఈ క్రమంలో విదేశాలలో పనిచేస్తున్న మన దేశ పౌరులతో మాట్లాడినప్పుడు తాను చేసే పనికి, వచ్చే జీతానికి సంతోషంగా ఉందని, తమ కుటుంబాన్ని సంతోషంగా చూసుకుంటున్నామని తెలిపినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ పని చేయాలని ఆలోచనతో ముందుకు వెళ్లాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ విదేశాలలో ఉద్యోగ భద్రతతో కూడిన ఉపాధి కల్పించడం జరుగుతుందని, ఆయా దేశాలలో సాంఘిక భద్రత, కార్మిక చట్టాల ద్వారా కార్మికులకు సంతృప్తికరమైన ఉపాధి లభిస్తుందని తెలిపారు. వారానికి 35 గంటల పని ఉంటుందని, నిబంధనల ప్రకారం నైపుణ్యత, అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆయా దేశాలకు సంబంధించి అర్హత గల అభ్యర్థులు ఆ దేశాల భాష నేర్చుకోవాలని, సాంకేతిక నైపుణ్యత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందేందుకు వేరే ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానిక యువతకు మందమర్రి మండలంలో అందుబాటులో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత, ఆసక్తి గల నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

# తాలు, తడక పేరుతో రైతులను దోపిడీకి గురిచేస్తే ఏ మాత్రం సహించం : ఎమ్మెల్యే సత్య నారాయణ రావు



భూపాలపల్లి ప్రతినిధి, మే 13 (భారత శక్తి) భూపాలపల్లి కలెక్టర్ ఆఫీసులో బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ధాన్యం, మక్కలు కొనుగోలుపై రెవిన్యూ, పౌరసరఫరాలు, పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, మార్కెటింగ్ రవాణ, డిఆర్డిఓ, సహకార, పంచాయతీరాజ్, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుకు ట్రక్ షీట్ ఇవ్వకపోవడం పట్ల రైతుల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 30 రోజులు దాన్యం, మక్కల కొనుగోలులో చాలా ప్రతిష్టాత్మమని ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుందని తెలిపారు. సమావేశాల్లో మాట్లాడుకున్నది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటా వేసిన తదుపరి రైతుకి ఏమి సంబంధమని, ట్రక్ షీట్ జారీ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని, దాని వల్ల రైతుల ఇబ్బందులకు గురి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఫల్యం జరుగుతుందని అందుకు ఆయా శాఖల అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. తాలు పేరుతో అబద్ధాలు ఆడొద్దని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్ వ్యవసాయ శాఖ అధికారులతో వరి కోత యంత్రాల యజమానులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. తాలు, తరుగులు తీయొద్దని మిల్లర్లకు పలుమార్లు చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మీ సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం కానీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రంలో కాంటా వేసిన తదుపరి కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, మిల్లర్లదే బాధ్యతని కాంటా అయ్యేంత వరకు మాత్రమే రైతు బాధ్యతని తెలిపారు. అకాల వర్షాలకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని

తెలిపారు. రైతులను ఎందుకు ఇబ్బందులు గురి చేస్తున్నారని అని ప్రశ్నించారు. ఇది రైతు చేసిన పాపమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదాము, రవాణా, కాంటా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రవాణాలో ఇబ్బందులు కల్పిస్తే ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రవాణాలో ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఇదే చివరి వార్నింగ్ అని హెచ్చరించారు. రైతులకు 48 గంటల్లో నగదు జమ చేసేందుకు కొనుగోలు జరిగిన వెంటనే ఓపిఎంఎస్ లో నమోదు చేయాలని తెలిపారు. రైస్ మిల్లులు వద్ద దాన్యం దిగుమతి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. ప్రతిరోజు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంతకుమారి, పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, రమణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, డిఆర్డిఓ బాలకృష్ణ, సహకార అధికారి వాలియా నాయక్, డిపిఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# న్యూరో ఫిట్స్ వ్యాధుల పై అప్రమత్తత అవసరం

## - సకాలంలో గుర్తిస్తే మెరుగైన చికిత్స సాధ్యం
## - ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సాయి సతీష్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 13 ( భారత శక్తి ) : న్యూరో సంబంధిత వ్యాధులు, ఫిట్స్ సమస్యల పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సాయి సతీష్ సూచించారు. సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో అంకం మల్లేష్ మేనేజర్ నిర్వహణలో బుధవారం మంచిర్యాలలోని ఓ ప్రముఖ హోటల్లో న్యూరో, ఫిట్స్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం జీవనశైలి మార్పులు, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, ఆహారపు అలవాట్ల కారణంగా న్యూరో సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. తలనొప్పి, మతిమరుపు, చేతులు--కాళ్లలో బలహీనత, తల తిరగడం, అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఫిట్స్ సమస్య వచ్చినప్పుడు భయపడకుండా వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదిస్తే థ్రాంబోలైసిస్ ప్రక్రియను స్ట్రోక్ సంభవించిన 4.5 గంటలలోపు తప్పనిసరిగా నిర్వహించాలని

ఆధునిక వైద్య విధానాలతో మెరుగైన చికిత్స అందుబాటులో ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఫిట్స్ను మూఢనమ్మకాలతో అనుసంధానం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు. వైద్య పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే సాధారణ జీవితం గడపవచ్చన్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా న్యూరో సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స ఎలా చేయాలి, ఫిట్స్ వచ్చిన వ్యక్తిని ఎలా సంరక్షించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి వంటి అంశాలపై వైద్యులు వివరించారు. ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను ముందుగానే గుర్తించవచ్చన్నారు.

# చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.

## -రైతులెవ్వరూ అధైర్య పడొద్దు: టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) మే 13 :



చివరి వడ్ల గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులెవరూ అధైర్య పడవద్దని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం కంది మండలం కలివేముల గ్రామంలో పిఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు విషయం లో నిబద్ధతతో ఉందని, రైతులు పండించిన పూర్తి ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ప్రైవేట్ రైస్ మిల్లర్ల వద్ద ధాన్యం అమ్మవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్మాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ బ్లాక్ ప్రెసిడెంట్ చిద్రుప్ప రఘు, కంది మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ మొగులయ్య, మాజీ ప్రెసిడెంట్ మోతి లాల్, పిఏసిఎస్ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ పవిత్ర, ఉప సర్పంచ్ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, వార్డు మెంబర్ లు, రైతులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



జిన్నారం మున్సిపల్, మే 13 (భారత శక్తిన్యూస్): సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం జిన్నారం మున్సిపల్, రెవెన్యూ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 39 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 39 లక్షల రూపాయల విలువైన చెక్కులను బుధవారం జిన్నారంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు పఠాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయడం జరిగింది, ఈ సందర్భంగా పటాన్చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి పారదర్శకతతో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్, వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి, తహసిల్దార్ దేవదాసు, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దంపల్లి గ్రామపంచాయతీకి నిధులు ఇచ్చింది బిఆర్ఎస్ ప్రభుత్వం

రేగొండ, మే 13 (భారత శక్తి) బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పెద్దంపల్లి గ్రామపంచాయతీ కోటి రూపాయల నిధులు మంజూరు చేశారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణం, స్మశాన వాటిక, సిసి రోడ్లు ఇలా అనేక అభివృద్ధి పనులను చేపట్టాం. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గెలిచినప్పటి నుండి పెద్దంపల్లి గ్రామపంచాయతీకి ఒక రూపాయి కూడా మంజూరు చేయలేదు. గ్రామపంచాయతీ భవనానికి 20 లక్షల ఉపాధి నిధులు ఇచ్చానని చెప్పుకోవడం సిగ్గుచేటు

ఇప్పటికైనా పెద్దంపల్లి గ్రామానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. లేనియెడల ప్రజలే మీకు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీందర్, వార్డు సభ్యులు అంబాటి కార్తీక్, మడికొండ భార్గవి, నాయకులు



వజీర్ శ్రీనివాస్, వజీర్ భోగి, భోదాస్ రాజు, మల్లేష్, శీలవంతుల నరసింహమూర్తి, పూర్ణచందర్, పసుల రాజు, సకినాల రజినీకాంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు పాటించాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) మే 13: భారత దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు మరియు నూతన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు -- 2026 (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పద్ధతి 2026) ప్రకారం జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి, ఘన వ్యర్థాల నిర్వహణకు శానిటేషన్ ప్లాన్ ను గ్రామ పంచాయతీలు మునిసిపాలిటీలు ప్రతిపాదనలు సిద్ధం చేసి వచ్చే 15 రోజుల్లోగా యాక్షన్ ప్లాన్ సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్ తెలిపారు. సాలిడ్ వేస్ట్ డిస్ట్రిక్ట్ మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశములో ఆదేశించారు. ప్రతి వ్యర్థ ఉత్పత్తిదారుడు ఘన వ్యర్థాల వల్ల పర్యావరణ కాలుష్యం కలగకుండా నివారించుటకు లేదా తగ్గించుటకు తగిన చర్యలు తీసుకోవాలి. తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఉత్పత్తి అయ్యే చోటనే నాలుగు వేర్వేరు విభాగాలుగా అవి తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక జాగ్రత్త అవసరమైన వ్యర్థాలు వేరు చేయాలి. ఘన వ్యర్థాలను వీధులలో, బహిరంగ ప్రదేశాలలో, ఇంటి బయట, కాలువల్లో లేదా నీటి వనరులలో వేయరాదు కాల్చరాదు, పాతి పెట్టరాదు. అన్ని గేటెడ్ కమ్యూనిటీలు, సంస్థలు, అన్ని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, మార్కెట్ అసోసియేషన్లు, హోటల్లు, రెస్టారెంట్లు ఈ నియమాలను స్థానిక సంస్థలు మునిసిపాలిటీల భాగస్వామ్యంతో తప్పక పాటించాల్సినది: (భారీ వ్యర్థాలను ఉత్పత్తి చేసేవారు): ఆన్లైన్ లో రిజిస్ట్రేషన్ (ఈ బి డబ్ల్యు జి ఆర్) నమోదుచేసుకోవాలి.



మూల స్థాయిలో వ్యర్థాలను వేరు చేయాలి. తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక జాగ్రత్త అవసరమైన వ్యర్థాలు గా నాలుగు రకాలుగావేర్వేరు విభాగాలుగా డస్ట్ బీన్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను వ్యర్థ నిర్వహణ కేంద్రానికి గాని లేదా చెత్త వాహనమునకు గాని అందించాలి. బయో మెడికల్ వ్యర్థాలను ఘన వ్యర్థాలలో కలపరాదు. సహజంగా కుళ్ళిపోయే వ్యర్థాలను తమ ప్రాంగణంలోనే కంపోస్టింగ్ లేదా బయో మెతనేషన్ ద్వారా శుద్ధి చేసి నిర్వహించాలి. మిగిలిన అవశేష వ్యర్థాలు స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ వారు సూచించిన విధంగా వ్యర్థాలు సేకరించే వారికి లేదా ఏజెన్సీ లకి అప్పగించాలని కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, మున్సిపల్ కమిషనర్ లు సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్, నేరేడుచర్ల హనుమంత రెడ్డి, రమాదేవి, శ్రీనివాసు, తదితరులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలి : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, మే 13 (భారత శక్తి ప్రతినిధి):

విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమాల్లో విద్య వారోత్సవాలను పురస్కరించుకొని ధర్మపురి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, డ్రాప్‌అవుట్‌ల నివారణ, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాల కల్పనపై సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి కోరారు. గ్రామాల్లో విద్యాపై అవగాహన పెంచడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చని అన్నారు.ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా నిలవాలంటే ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థుల



భవిష్యత్తు బాగుంటేనే రాష్ట్ర భవిష్యత్తు బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రధాని పర్యటన ముగిసిన మరుసటి రోజే బండి సంజయ్ కుమారుడి కేసుపై ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించిందని తెలిపారు. సిట్ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని బీఆర్ఎస్ నాయకులు వ్యాఖ్యానించడం దౌర్భాగ్యకరమని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కూడా బండి భగీరథపై మీడియాలో పలు కథనాలు వచ్చాయని, అప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. చట్టానికి ఎవరు అతీతులు కాదని, పోలీసులు చట్టపరంగా తమ విధులు నిర్వర్తిస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటాం: భూపాలపల్లి ఎమ్మెల్యే జి ఎస్ ఆర్

భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, మే 13 (భారత శక్తి) ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక విద్యా వారోత్సవాల రోజు వారి కార్యాచరణ కార్యక్రమాలపై మండల విద్యాశాఖ అధికారులు, సర్పంచ్ లతో వర్క్ షాప్ నిర్వహించారు. ముందుగా సరస్వతి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే దేవాలయాలని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ మీద పటిష్టమైన ఆలోచనతో ముందుకు వెళుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరగాలన్న లక్ష్యంతో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో ఒక ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపిక చేసి సెమి రెసిడెన్షియల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలల్లో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి వసతి గృహల్లోని విద్యార్థులకు 200 శాతం కాస్మెటిక్ చార్జీలు, 40 శాతం డైట్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. సర్పంచులు తమ తమ పరిధిలో గల పాఠశాలలను తనిఖీ చేసి విద్యాబోధన, మెనూ అమలును పరిశీలించాలని ఆయన సూచించారు. భవిష్యత్ తరాలను మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత మనందరిపైందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ కంటే ప్రభుత్వ వ్యవస్థ చాలా పటిష్టమైనదని, అనుభవజ్ఞులైనటువంటి ఉపాధ్యాయులు ఉన్నారని ఆయన తెలిపారు. పాఠశాలల్లో క్రీడా స్థలాలు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో లైబ్రరీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు పాఠనాశక్తిని పెంపొందించడమే కాకుండా ఉద్యోగాలు సాధనకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. విద్యా వ్యవస్థను బలిపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ క్రమంలో ఎక్కడైనా తప్పులు జరిగితే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.



పాఠశాలల మీద నుండి విద్యుత్ లైన్లు వెళ్తుంటే అట్టి జాబితాను అందజేయాలని వాటిని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యార్థుల కొరకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి అన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి రోజు చేయాల్సిన కార్యక్రమాలను నిర్దేశించినట్లు తెలిపారు. విద్య మీద సర్పంచులు ఫోకస్ పెట్టి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన పనులు చేపట్టి పాఠశాలలను సుందరీకరణ చేసినట్లు తెలిపారు. జిల్లాలో యంగ్ ఇండియా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఈ సంవత్సరం 10వ తరగతి, ఇంటర్ లో మంచి ఫలితాలు సాధించామని, విద్యార్థులను, ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థులు బాగా చదివి మన జిల్లాకు, రాష్ట్రానికి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. విద్యా వైద్యంపై ప్రభుత్వం ఎక్కువ ఫోకస్ పెడుతున్నట్లు ఆయన సూచించారు.ప్రతి పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్ఓ వసంతకుమారి, గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ అన్ని మండలాల ఎంఈఓలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం-2026' జాతీయ క్విజ్ ప్రారంభం

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, మే 13:


హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో మై భారత్ ద్వారా యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం (వీవీవీపీ)-2026 కోసం జాతీయ స్థాయి క్విజ్‌ను ప్రారంభించింది. మై భారత్ వెబ్‌సైట్ లిమై భారత్ పోర్టల్ రిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. 2026 జూన్‌లో సరిహద్దు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనే యువతను ఎంపిక చేయడంలో మొదటి దశగా ఈ క్విజ్ జరుగుతుంది.

యువత నేతృత్వంలో చేపట్టే జాతీయ కార్యక్రమమే వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం - 2026. లేహ్-లదాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ప్రాంతాల్లోని సరిహద్దు గ్రామాల అభివృద్ధిలో క్షేత్రస్థాయిలో పాల్గొనడాన్ని, సామాజిక భాగస్వామ్యాన్ని, సాంస్కృతిక వినిమయాన్ని, అవగాహనను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

దేశవ్యాప్తంగా 2026 మే 10 నుంచి 20 వరకు ఆన్‌లైన్ క్విజ్ నిర్వహిస్తారు. వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాం దార్శనికత, లక్ష్యాల గురించి పోటీదారుల్లో అవగాహన పెంపొందించడం, దేశ నిర్మాణంలో, సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి లో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

సరిహద్దు గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్కృతి, పర్యావరణ అవగాహన, పరిపాలన కార్యకలాపాలు, సమాజ భాగస్వామ్యం, సరిహద్దు ప్రాంతాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ప్రయత్నాల గురించి తెలుసుకొనే వేదికగా ఈ క్విజ్ పనిచేస్తుంది.

క్విజ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి అర్హత, శారీరక ధారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 500 మంది మై భారత్ స్వచ్ఛంద సేవకులను 2026 జూన్లో నిర్వహించే వికసిత్ వైబ్రంట్ విలేజెస్ ప్రోగ్రాంలో ఒక వారం పాటు పాల్గొనేందుకు




ఎంపిక చేస్తారు.

గుర్తించిన సరిహద్దు గ్రామాల్లో క్షేత్రస్థాయి కార్యక్రమాల్లోనూ, సామాజిక కార్యకలాపాల్లోనూ ఎంపికైన స్వచ్ఛంద సేవకులు నిమగ్నమవుతారు. క్షేత్రస్థాయి అభివృద్ధికి, జాతీయ సమైక్యతకు సంబంధించిన స్వచ్ఛతా డ్రైవ్‌లు, యువతతో చర్చలు, పర్యావరణపరమైన కార్యక్రమాలు, సాంస్కృతిక వినమయ కార్యకలాపాలు, అవగాహన సదస్సులు, కెరీర్ కౌన్సిలింగ్ సెషన్లు, ప్రయోగాత్మక అభ్యాస అవకాశాలపై దృష్టి సారిస్తారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే లక్ష్యంలో చురుకైన భాగస్వామిగా యువతను శక్తిమంతం చేయాలనే ప్రభుత్వం అంకితభావాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది. అలాగే శక్తిమంతమైన, స్థిరమైన సరిహద్దు సమాజాలకు ఇస్తున్న ప్రాధాన్యంపై అవగాహనను పెంపొందిస్తుంది. ఆసక్తి ఉన్న యువత మై భారత్ పోర్టల్ ద్వారా క్విజ్‌లో పాల్గొనవచ్చు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 13 ( భారత శక్తి ) : రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల,నమ్నూర్,రాపల్లి లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని,అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా జిల్లాలో గుర్తించిన గోదాములలో నిల్వ చేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని,కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి,నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు.రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఈసారి అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి:జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి) మే 13:

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎస్.పి.నరసింహ తో కలసి జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం ఆయన రామకోటి తండ, చివ్వెంల మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు



తప్పవని హెచ్చరించారు.కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, తహసిల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపును వేగవంతం చేయాలి కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు లేకుండా చర్యలు: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 13(భారత శక్తి) మొక్కజొన్న, వరి ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన ధాన్యం గోదాములకు తరలింపు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతశీ చేయాలనీ ఆదేశించారు. ఇప్పటికే టోల్ ప్లాజాలు, చెక్‌పోస్టుల వద్ద ఖాళీ లారీలను గుర్తించి ధాన్యం తరలింపునకు వినియోగిస్తున్నామని తెలిపారు. అవసరానికి అనుగుణంగా మరిన్ని లారీలు సమకూర్చుకోవాలని సూచించారు. లారీలు సమకూర్చే ప్రాంతాలు, అన్‌లోడింగ్ కేంద్రాల వద్ద రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ తదితర శాఖల సిబ్బందిని షిఫ్ట్‌ల వారీగా నియమించాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం సంచులు నిల్వ ఉండకూడదని స్పష్టం చేశారు. అవసరమైతే స్థానిక కూలీలను హమాలీలుగా నియమించుకోవాలని తెలిపారు. 25 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో అన్‌లోడింగ్ పాయింట్లు ఉన్న కేంద్రాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ధాన్యం రవాణా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ గోదాములతో పాటు ప్రైవేట్ గోదాములు, రైతు వేదికలు తదితర ప్రాంతాల్లో కూడా ధాన్యం నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, వరి, మొక్కజొన్న ధాన్యం తరలింపు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేందుకు పోలీస్ శాఖ



నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాలు, ఇతర తనిఖీ కేంద్రాల్లో తగిన పోలీసు సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. రైతుల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఎస్పీ శ్రీనివాస్, పౌర సరఫరాల అధికారులు, మేనేజర్లు రాజేందర్, సుధాకర్, డీఎం మార్క్‌ఫెడ్ మహేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక ఉత్సవాలల్లో పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

ములుగు జిల్లా ప్రతినిధి, మే13(భారత శక్తి): జిల్లాలో మే 20 నుంచి 22 వరకు నిర్వహించే సాంస్కృతిక వైభవం ఉత్సవాలలో పాల్గొనేందుకు జిల్లా ప్రజలు, కళాకారులు, క్రీడాకారులు, విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుందని, ఉత్సవాలపై ప్రజలకు తెలియజేసేలా విస్తృత ప్రచారం కల్పించాలని, సోషల్ మీడియా, ఇతర ఛానెళ్ల ద్వారా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

క్రీడల విభాగం లో వాలీబాల్, చెస్, క్యారమ్స్ , సాంస్కృతిక కార్యక్రమాల విభాగంలో రంగోళి పోటీ, ఫుడ్ స్టాళ్లు, మెహందీ పోటీ, హెయిర్ స్టైల్ పోటీ, టగ్ ఆఫ్ వార్, గిరిజన నృత్య ప్రదర్శన, కవి సమ్మేళనం లలో పాల్గొనే వారు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, అదే విధంగా ములుగు అభివృద్ధి,ప్లాస్టిక్ రహిత ములుగు,డ్రగ్స్ రహిత ములుగు అనే మూడు అంశాలపై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ విభాగం లో ఒక టీమ్‌కు 3 మంది



చొప్పున, ప్రతి అంశంపై 5 టీమ్‌ల వరకు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆసక్తి కలిగిన ప్రజలు, మహిళలు, కళాకారులు,విద్యార్థులు, క్రీడాకారులు మే 13 నుంచి మే 18వరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడి ధర్మ నాయక్ సెల్ నంబర్ 7032153610 లేదా డివైఎస్ఓ రామ్మోహన్ 7207503775 కు ఆన్‌లైన్ విధానం లో వాట్సాప్ ద్వారా తమ వివరాలు పంపించాలని, ఆఫ్‌లైన్ విధానంలో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం లేదా జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం లో ఈ నెల 18న సాయంత్రం 5 గంటలలోపు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

# బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరైన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.



నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 13(భారత శక్తి) బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు, గోవుల అక్రమ రవాణా నివారణ చర్యలపై రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ జిల్లా ఎస్పీలు, సిపిలు,ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.


ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అన్ని ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన రహదారులు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు లక్ష్యాలను పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

ములుగు జిల్లా ప్రతినిధి, మే13 (భారత శక్తి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటును అందించాలని, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిరంతరాయంగా కృషి చేస్తూ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



అన్నారు.99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక విద్య వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల విద్యా కార్యక్రమాల పై విద్యాశాఖ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర గేయాలపన తో ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందించాలని, విద్య ప్రమాణాలు పెంపొందించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గూర్చి గ్రామాలలో, మున్సిపాలిటీ పరిధిలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తూ పాఠశాలలో 100 శాతం విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్ర వ్యాప్తంగా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలవడం గర్వకారణంగా ఉందని తెలిపారు.

సమాజ నిర్మాణం లో బలమైన పునాది వేయడానికి పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల సంక్షేమం, సమాజ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి పలు చారిత్రాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలకు సహాయ సహకారాలు అందించడం ద్వారా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, ప్రభుత్వ విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెరుగుతుందన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, బడిబాట కార్యక్రమం, డిజిటల్ మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అభ్యాస కార్యక్రమాలు, ప్రత్యేక యంగ్ ఇండియా ఇన్స్టిట్యూషన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలు, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకం, ప్రీ ప్రైమరీ విద్యా విస్తరణ, బాలికల విద్యను బలోపేతం చేయడానికి కేజీబీవీ పాఠశాలలు, పాఠశాలల నిర్వహణలో పారదర్శకత బాధ్యత వ్యవస్థ నిర్మించడానికి ఎఫ్ ఆర్ ఎస్ సిస్టం వంటి పలు అభ్యర్థి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు.ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో భాగంగా లైబ్రరీల ఏర్పాటుపై దృష్టి సారించాలని దీనిద్వారా స్థానిక ప్రజలకు అనేక ప్రయోజనాలు చేకూరతాయని సూచించారు.

గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ దృష్టి సారించాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వేలు, నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకుంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. : మునిసిపల్ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేయడానికి మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. స్థానిక కౌన్సిలర్లు ప్రభుత్వ పాఠశాలలను తరచు పర్యవేక్షిస్తూ పాఠశాలల నిర్వహణ ఉపాధ్యాయుల బోధన పద్ధతులపై దృష్టి పెట్టాలని, విద్యార్థి సంఖ్య పెంపొందించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. : జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల క్రమశిక్షణతో ములుగు జిల్లా పదవ తరగతి పరీక్ష ఫలితాలలోరాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని సాధించిందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య, ఉచిత యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ మధ్యాహ్నం భోజనం కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ ఆసియా షాహిన్, జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, మే 13 (భారతశక్తి ప్రతినిధి):

ధర్మపురి పట్టణ కేంద్రంలోని స్థానిక హనుమాన్‌వాడలో మరియు బుద్దేశ్‌పల్లె గ్రామానికి చెందిన కడారి గంగాధర్ నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సిపల్ చైర్మన్ వేముల రాజేష్ నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు,



పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం వద్దు రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 12(భారత శక్తి)జిల్లాలో ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం దిలావార్ పూర్ టోల్ ప్లాజా, లోకేశ్వరం మండలంలోని పలు రైస్ మిల్లులను ఆయన స్వయంగా సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు చేరుకున్న లారీలను 24 గంటల్లోపు తప్పనిసరిగా అన్‌లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్‌లు, అక్రమ కోతలు అనుమతించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.హమాలీల కొరత ఉన్న ప్రాంతాల్లో వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ధాన్యం దిగుమతిలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే పీపీసీలు, రవాణా విభాగం, రైస్ మిల్లుల మధ్య సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు.రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడింగ్ చేసి వారికి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, సివిల్ సప్లై అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సూర్యరావ్ తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబు.. ది గ్రేట్...



విజయవాడ, మే 13, (న్యూస్ పల్స్)

ఏపీ సీఎం చంద్రబాబు వయసుకు మించి కష్టపడుతున్నారు. ఒకవైపు రాష్ట్ర పాలన చూస్తూనే మరోవైపు జాతీయ స్థాయిలో సైతం నిత్య పర్యటనలు చేస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించే క్రమంలో వరుసగా భేటీలు జరుపుతున్నారు. నిత్య సమీక్షలు కొనసాగుతున్నాయి. ఢిల్లీలో సంప్రదింపులు జరుపుతున్నారు. ఎన్ డి ఏ సమావేశాలకు హాజరవుతున్నారు. బిజెపితో పాటు ఎన్డీఏ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రభుత్వాలు కొలువు తీరుతున్న సమయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు హాజరవుతున్నారు. గత వారం రోజులుగా సీఎం చంద్రబాబు షెడ్యూల్ ను పరిశీలిస్తే.. క్షణం తీరిక లేకుండా గడుపుతున్న పరిస్థితి. ఈ వయసులో కూడా ఆయన కష్టపడుతున్న తీరు మాత్రం ఆకట్టుకుంటుంది.పశ్చిమ బెంగాల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. 15 సంవత్సరాల మమతా పాలనను తెరదించుతూ కాషాయ జండా ఎగురవేసింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సువేందూ అధికారి ప్రమాణం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు ఎన్డీఏ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఏపీ సీఎం చంద్రబాబు కు ప్రత్యేక ఆహ్వానం అందింది. దీంతో కార్యక్రమానికి హాజరైన చంద్రబాబుకు కేంద్ర పెద్దలు గౌరవభావంతో చూశారు. చాలా ప్రాధాన్యం ఇచ్చారు. బిజెపిలో కొనసాగుతున్న బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి చంద్రబాబుకు పాదాభివందనం చేశారు.పశ్చిమ బెంగాల్ సీఎం ప్రమాణ స్వీకారం నుంచి హైదరాబాద్ చేరుకున్నారు చంద్రబాబు. అదే సమయంలో హైదరాబాద్ వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ నేరుగా చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. అక్కడ గంటపాటు గడిపారు మోడీ. అయితే ఆ పర్యటన ముగిసిన వెంటనే ఢిల్లీ బాట పట్టారు చంద్రబాబు. నిన్న రోజంతా కేంద్ర మంత్రులను కలిసి ఏపీలో కీలక ప్రాజెక్టుల కు సంబంధించిన అంశాలను చర్చించారు. సాయంత్రం ఉన్నత స్థాయి సదస్సులో సైతం పాల్గొన్నారు. ఢిల్లీలోనే రాత్రి బస చేశారు. మంగళవారం అస్సాం లో సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఇలా క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు సీఎం చంద్రబాబు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ పాలనలో క్షణం తీరిక లేకుండా ఉంటూనే.. జాతీయస్థాయిలో సైతం అన్ని కార్యక్రమాలకు హాజరవుతున్నారు. నిజంగా చంద్రబాబు ఓపికకు హాట్సాఫ్ చెప్పాల్సిందే.

# బీజేపీతో కయ్యమేనా

విజయవాడ, మే 13,

పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీతో ఒక రకమైన అప్రకటిత మిత్రత్వం కొనసాగించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు తన రాజకీయ వ్యూహాన్ని సమూలంగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. పశ్చిమ ఆసియా ఉద్రిక్తతల కారణంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు చేసిన సెవెన్ అప్పీల్స్ పిలుపుపై వైసీపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఇది కేవలం ఒక విధానపరమైన విమర్శ మాత్రమే కాదని, బీజేపీతో తెగతెంపులు చేసుకునే దిశగా పడుతున్న తొలి అడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు.తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన వైసీపీ అధికార ప్రతినిధి పేర్ని, ప్రధాని మోదీపై నేరుగా విమర్శలు గుప్పించారు. ప్రజలకు నీతులు చెప్పే ముందు మోదీ ఆ సూత్రాలను స్వయంగా ఆచరించి చూపాలి అంటూ ఎద్దేవా చేశారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులకు ప్రజలే కారణమన్నట్లుగా ప్రధాని వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ముఖ్యంగా బంగారం కొనుగోళ్లు ఆపాలని, విదేశీ పర్యటనలు వాయిదా వేసుకోవాలని చెప్పడం కాదని మోదీ ఆచరించాలన్నారు. తమిళనాడులో సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళ వెట్రి కజగం సాధించిన విజయం, అక్కడ ఆయన అనుసరిస్తున్న రాజకీయ పంథా జగన్‌ను ఆకర్షించినట్లు కనిపిస్తోంది. విజయ్ నేరుగా రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్‌తో జతకట్టి అక్కడ అధికారంలోకి రావడంతో, జగన్ కూడా అదే తరహా ప్రయోగానికి సిద్ధమవుతున్నారని సమాచారం. బీజేపీ , టీడీపీ,జనసేన ఒకే కూటమిలో ఉండటంతో జగన్ ఇక బీజేపీపై ఆశలు వదులుకున్నట్లు తెలుస్తోంది. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉన్న జగన్, ఇప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఆ పార్టీ వైపు మొగ్గు చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ కూటమిని ఢీకొట్టాలంటే కాంగ్రెస్‌తో కలవడమే ఏకైక మార్గమని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. విజయ్ పార్టీని నెత్తికెక్కించుకున్న వైసీపీ సోషల్ మీడియా విభాగాలు కూడా, బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపించడం ద్వారా కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు క్షేత్రస్థాయిలో సంకేతాలు పంపుతున్నాయి.రాష్ట్రంలో టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి బలంగా ఉండటంతో, జగన్ ఇక తన పోరాటాన్ని నేరుగా కేంద్రంపైకి మళ్లించాలని నిర్ణయించుకున్నారు. గతంలో విభజన హామీలు, ప్రత్యేక హోదా విషయాల్లో కేంద్రంపై మెతక వైఖరి అవలంబించారనే విమర్శలను చెరిపివేసేందుకు మోదీని నేరుగా టార్గెట్ చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇటీవల పార్లమెంట్ లో ప్రత్యేకహోదా అంశాన్ని వైసీపీ ఎంపీలు ప్రస్తావించారు. ప్రధాని మోదీ విఫలమవుతున్నారని వైసీపీ అధికారికంగా ప్రకటించడం అంటే, భవిష్యత్తులో బీజేపీతో దోస్తీకి శాశ్వతంగా ముగింపు పలికినట్లేనని భావించవచ్చు. విజయ్ స్ఫూర్తితో కాంగ్రెస్ వైపు అడుగులు వేయడం ద్వారా జగన్ తన రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటున్నారు. ఒకవేళ జగన్ నిజంగానే కాంగ్రెస్‌తో జట్టు కడితే, అది ఏపీలో మాత్రమే కాకుండా జాతీయ స్థాయిలో కూడా పెద్ద సంచలనంగా మారనుంది.

# బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఫెన్సింగ్ ఏర్పాటు

కోల్ కత్తా, మే 13,

బెంగాల్ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బిజెపి ఏం చేస్తుందనే ప్రశ్నకు తొలి సమాధానం చెప్పేశాడు బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి. తన రాజకీయ గురువు మమతా బెనర్జీకి ఇప్పటికే షాక్ ల మీద షాక్ లు ఇచ్చిన సువేందు అధికారి.. తాజాగా మరో మాస్టర్ స్ట్రోక్ ఇచ్చేసాడు.ఇప్పటికే ఎమ్మెల్యేగా ఓడిపోయి మమత దీనంగా ఇంట్లో కూర్చుని ఉన్నారు. భవిష్యత్తును తలుచుకుంటూ భయభయంగా గడుపుతున్నారు. ఇప్పటికే చాలామంది టీఎంసీ నేతలు బిజెపిలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. కాకపోతే అధిష్టానం నుంచి ఇంతవరకు గ్రీన్ సిగ్నల్ రాలేదు. 15 సంవత్సరాలపాటు అధికారంలో ఉన్న టీఎంసీ.. కార్యకర్తలను కాపాడుకోవడం ఇకపై కష్టమేమో. ఎందుకంటే అధికారాన్ని కోల్పోయిన మరుక్షణమే టీఎంసీ నేతలు కండువాను మార్చడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే బిజెపి అంత ఈజీగా వారిని పార్టీలోకి తీసుకొని అవకాశం కనిపించడం లేదు.వెస్ట్ బెంగాల్లో తొలిసారి గవర్నమెంట్ ని ఏర్పాటు చేసిన బిజెపి.. తన మార్క్ ను చూపించేందుకు సిద్ధమవుతోంది. తొలి క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి సువేందు అధికారి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో ప్రధానమైనది బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం.. దీనికి సంబంధించి భారత సెక్యూరిటీ ఫోర్స్ కు అవసరమైన భూమిని బదిలీ చేయడానికి బెంగాల్ ప్రభుత్వం ఓకే చెప్పింది.. సరిహద్దుల్లో భద్రత.. బంగ్లాదేశ్ ప్రాంతం నుంచి చొరబాట్లను అడ్డుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. భూమి బదిలీ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన మొదలు పెడుతున్నారు. 45 రోజుల్లోనే ఇది పూర్తి చేస్తారు.భూమి బదిలీ జరిగిన వెంటనే భారత సెక్యూరిటీ ఫోర్స్ రంగంలోకి దిగుతుంది. వెంటనే ఫెన్సింగ్ నిర్మాణం ప్రారంభిస్తుంది. దీనివల్ల అక్రమ చొర బాట్లు ఆగిపోతాయని బెంగాల్ ప్రభుత్వం భావిస్తోంది. బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బంగ్లాదేశ్ విమర్శించింది. భూ కేటాయింపును బంగ్లాదేశ్ తీవ్రంగా తప్పు పట్టింది. ముళ్ళ తీగలకు భయపడేది లేదని స్పష్టం చేసింది. భద్రత విషయంలో భారత్ మానవత దృక్పథంతో ఆలోచించాలని సూచించింది. అయితే భారత్ అంతర్గత రాజకీయాలలో తాము వేలు పెట్టబోమని.. కేంద్రంతో సంబంధాలే తమకు ముఖ్యమని బంగ్లాదేశ్ ప్రకటించింది.. మరోవైపు చొరబాట్లను మాత్రమే తాము అడ్డుకుంటామని ఇప్పటికే కేంద్రం పదేపదే స్పష్టం చేసింది.

========================

# హైదరాబాద్ బెటర్

## వైరల్ గా మారిన బెంగళూర్ టెకీ కామెంట్స్

హైదరాబాద్, మే 13, సాఫ్ట్‌వేర్ హబ్‌లుగా పేరుగాంచిన హైదరాబాద్, బెంగళూరు నగరాల మధ్య పోలిక ఈనాటిది కాదు. ఐటీ కంపెనీలు, జీవన ప్రమాణాలు, వాతావరణం.. ఇలా ప్రతి విషయంలోనూ ఈ రెండు నగరాల మధ్య పోటీ ఉంటుంది. అయితే తాజాగా ట్రాఫిక్ విషయంలో ఈ రెండు నగరాల మధ్య జరిగిన ఒక ఆసక్తికర చర్చ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్ రోడ్ల మౌలిక సదుపాయాలను చూసి ఓ బెంగళూరు వ్యక్తి ఆశ్చర్యపోతూ పెట్టిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. ఆర్చీ సేన్‌గుప్తా అనే వ్యక్తి ఎక్స్ వేదికగా తన అనుభవాన్ని పంచుకుంటూ.. “నేను ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నాను. ఇక్కడ 12 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 30 నిమిషాల్లో పూర్తి చేశానంటే నా బెంగళూరు మెదడుకు అర్థం కావడం లేదు. ఎందుకంటే బెంగళూరులో 30 నిమిషాలు అంటే కేవలం ఒక కిలోమీటరు ప్రయాణించినట్లే లెక్క. ఇక్కడి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిజంగా అద్భుతం” అంటూ రాసుకొచ్చారు.ఈ పోస్ట్ పెట్టిన కొద్దిసేపటికే 43,000కు పైగా వ్యూస్, వందలాది కామెంట్లతో నెట్టింట జోరుగా చర్చ నడిచింది. “నేను ఆఫీసు నుండి బయలుదేరినప్పుడు 50 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 45–55 నిమిషాల్లోనే చేరుకుంటాను” అని ఒక హైదరాబాద్ యూజర్ గర్వంగా చెబితే.. “నేను బెంగళూరు నుండి హైదరాబాద్ మారినప్పుడు నా ప్రయాణ సమయం అకస్మాత్తుగా నార్మల్ అయిపోయింది” అని మరొకరు తన అనుభవాన్ని పంచుకున్నారు.

# జగన్ తో దోస్తీ...
# వయా విజయ్ రాహుల్ ప్లాన్

చెన్నై, మే 13,

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు బిజెపి పై పల్లెత్తు మాట అనని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్కసారిగా స్వరం పెంచుకుంది. దేశ ప్రజలు పొదుపు పాటించాలని ఏడు అప్పీల్స్ చేశారు ప్రధాని నరేంద్ర మోడీ. వాటిని జాతీయ మిషన్ గా ప్రకటించారు. అయితే ఇప్పుడు వ్యతిరేకంగా



వైసీపీ కామెంట్లు పెడుతోంది. గతంలో కేంద్రం ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా శభాష్ అని పొగిడేవారు జగన్. బిజెపి అడగకుండానే మద్దతు తెలిపేవారు. కానీ ఇప్పుడు సడన్ గా రూటు మార్చింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. హైదరాబాద్ పర్యటనలో ప్రధాని మోదీ పొదుపు మంత్రాన్ని బోధిస్తే.. దానిని తప్పు పడుతూ మాట్లాడారు పేర్ని నాని. ప్రధాని స్థాయి నేతను చులకన చేస్తూ మాట్లాడారు.తమిళనాడులో విజయ్ గెలుపుతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన చేంజ్ కనిపిస్తోంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన క్రమంలో సాక్షి మీడియా చూపించిన ప్రత్యేక ఆసక్తి ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. విజయ్ గెలుపును ఒక చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించింది సాక్షి. అంతటితో ఆగకుండా ఆయనకు రాహుల్ గాంధీతో ఉన్న పాత స్నేహాన్ని హైలైట్ చేస్తోంది. అయితే రాహుల్ ను ఎత్తిచూపడం ద్వారా.. ఏపీలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు దిశగా జగన్ ఆలోచన చేస్తున్నారా అనేది ఒక అనుమానం. ఏపీలో జవసత్వాలు లేకుండా ఉంది కాంగ్రెస్ పార్టీ. అయినా సరే ఆ పార్టీకి ఓటు బ్యాంకు ఉంది. మళ్లీ జగన్ రూపంలో పొత్తు పెట్టుకుంటే క్యాడర్ ఉత్సాహంతో పనిచేసి.. ఐదు నుంచి 10% ఓటర్లు యాక్టివ్ అవుతారు. సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉన్న చాలా వర్గాలు తిరిగి యాక్టివ్ అవుతాయి. విజయ్, రాహుల్ గాంధీ మధ్య ఉన్న బంధాన్ని సాక్షి విపరీతంగా ప్రచారం చేయడం చూస్తుంటే.. ఏపీలో ఏదో పొత్తుల వ్యూహం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్నేళ్లుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలను పరిశీలిస్తే.. నేరుగా బిజెపి పై కానీ.. ఎన్డీఏ ప్రభుత్వం పై కాని విమర్శించిన దాఖలాలు లేవు. కానీ ఇప్పుడు నేరుగా ప్రధానిని టార్గెట్ చేయడం ద్వారా చూస్తుంటే మాత్రం ఏదో ఒక అనుమానం వ్యక్తం అవుతుంది. పైగా ఏపీ రాజకీయాలపై ఎక్కువగా దృష్టి పెట్టే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. జాతీయస్థాయి విధానాలపై బిజెపిపై విమర్శలు చేయడం చూస్తుంటే మాత్రం పక్క వ్యూహం అన్నట్టు అర్థమవుతోంది. ఇక ముసుగులో గుద్దులాట వద్దు అన్నట్టు ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కూడా జగన్ అభ్యంతరాలు తెలుపుతూ ఏకంగా ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు.. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీ వ్యక్తిగత ప్రయాణాలపై కూడా వైసిపి నేతలు మాట్లాడుతున్నారంటే.. బిజెపితో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవడం లేదని.. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యేందుకు ఒక మార్గమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సోషల్ మీడియాలో విజయ్ రికార్డ్

చెన్నై, మే 13



రాజకీయంగా ఎలా ఉన్నా సరే.. తమిళనాడు విజయ్ కి సోషల్ మీడియాలో మాత్రం విపరీతమైన ముఖ్యమంత్రి పాపులారిటీ ఉంటుంది.అతనికి బలమైన అభిమానులు ఉన్నారు.అతడు రాజకీయాలకు రాకముందే ఒక అభిమాన సంఘాన్ని ఏర్పాటు చేశాడు.దానిద్వారా సేవ కార్యక్రమాలు నిర్వహించారు.ఆ తర్వాత ఆ అభిమాన సంఘం పేరుతో విజయ్ తండ్రి రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తే ఒప్పుకోలేదు. చివరికి తన తండ్రి మీదనే విజయ్ పోలీస్ కేసు పెట్టాడు. ఆ తర్వాత కొద్ది రోజులపాటు విజయ్, ఆయన తండ్రి మాట్లాడుకోలేదు. ఆ సమయంలో విజయ్ తల్లి మధ్యవర్తి పాత్ర పోషించారుతమిళనాడు ముఖ్యమంత్రిగా స్వీకారం చేసిన తర్వాత విజయ్ గురించి స్థానిక మీడియా మాత్రమే కాదు నేషనల్ మీడియా కూడా విపరీతంగా ప్రయత్నిస్తోంది. ఇటీవల విజయ్ ప్రమాణ స్వీకారానికి సంబంధించిన లైవ్ ను దేశంలో ఉన్న అన్ని జాతీయ మీడియా సంస్థలు టెలికాస్ట్ చేశాయి. ఆ టెలికాస్ట్ సోషల్ మీడియాలో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేసింది. విపరీతమైన వ్యూస్ లభించడంతో విజయ్ నేషనల్ సెలబ్రిటీ అయిపోయాడు. రాజకీయాలలో ఎటువంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయబడలేదు. ఇటీవల విజయ్ ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ. ఆ సమయంలో వారిద్దరు ఒకరిని ఒకరు బ్రదర్ అంటూ సంభోదించారు.విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయనకు సంబంధించిన డైలీ అప్‌డేట్‌లు తెలుసుకోవడానికి అభిమానులు విపరీతమైన ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ చెల్లింపు తమిళనాడు సీఎంఓ పేజీకి గతంలో 4.4 లక్షల మంది ఫాలోవర్లు మాత్రమే ఉండేవారు. సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 48 గంటల్లోనే ఆ పేజీ రికార్డు స్థాయిలో ఫాలోవర్లు పెరిగాయి. ఇప్పుడు ఆ సంఖ్య అంతకుమించి అనే స్థాయికి చేరుకుంది. దాదాపు పది లక్షల మంది కొత్త యూజర్లు యాడ్ అయ్యారు.ఎక్స్ పేజీకి మిలియన్ యూజర్లు యాడ్ అయ్యారు. దీనితో ఆ సంఖ్య రెండు మిలియన్లను దాటేసింది.విజయ్ కి ఉన్న అపారమైన అభిమాన గణానికి ఇది ఒక నిదర్శనం అని రాజకీయ విశ్లేషకులు చూస్తున్నారు.విజయ్ ప్రమాణ స్వీకార సమయంలో మాట్లాడిన మాటలు చాలా హుందాగా ఉన్నాయి.తమిళ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉన్నాయి.ప్రతి సందర్భంలోనూ తమిళనాడు ముఖ్యమంత్రి అనే అహాన్ని విజయ్ చూపించలేదు. ప్రభుత్వం ఎలా పనిచేస్తుంది.. ఎలా పని చేస్తుందనే విషయాలపై స్పష్టత ఇచ్చారు. విజయ్ తమిళనాడు రాజకీయాలలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ ప్రజలకు సంకేతాలు ఇచ్చారు

# పొదుపు చేస్తే.. అమెరికాను దాటేయచ్చు

ముంబై, మే 13,

మన ఇంట్లో బియ్యం, పప్పులు మాత్రమే ఉన్నాయి. అవి వండుకోవడానికి నూనె, ఇతర పదార్థాలు కావాలి. అవి కావాలంటే కొనుగోలు చేయాలి. ఒక స్థాయి వరకు కొనుగోలు చేయవచ్చు. వాడకం స్థాయి దాటిపోతే బియ్యం, పప్పులలో కొంతమేర అమ్ముకొని వాటిని కొనుగోలు చేయాలి. ఇలా అమ్ముకుంటూ పోతే తినడానికి బియ్యం, పప్పులు మిగలవు. ఇప్పుడు అర్థమైంది కదా.. నరేంద్ర మోడీ భాగ్యనగరంలో పర్యటనకు వచ్చినప్పుడు ఎందుకు బంగారం కొనుగోలు చేయవద్దని చెప్పారో..ప్రధాని మాటలను నెగిటివ్ కోణంలో చూడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మన దేశానికి సంబంధించి దిగుమతులు ప్రతి ఏడాది పెరిగిపోతున్నాయి. దీనివల్ల విదేశీ మారక ద్రవ్యాన్ని భారీగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. భారత ఆర్థిక శాఖ నివేదిక ప్రకారం మన దేశం ప్రతి ఏడాది 900 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్నది. గత ఏడాది ఇంధనం, బంగారం, వంట నూనెలు, ఎరువుల కోసం ఏకంగా 23 లక్షల కోట్లను ఖర్చు పెట్టింది. మన దేశానికి సంబంధించి దిగుమతుల బిల్లు ఏకంగా 74 లక్షల కోట్ల వరకు ఉంటుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక మనం ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా ఉన్న దేశంగా కొనసాగుతున్నాం. మన దేశ జనాభాకు.. ఉన్న నిలువలను కాస్త అంచనా వేసుకుంటే తొమ్మిది నుంచి 11 నెలల వరకే సరిపోతాయి. ఒకవేళ అవి గనక కరిగిపోతే ఆర్థిక సంక్షోభానికి దారి తీయవచ్చు. అందువల్లే దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆ తరహాలో సూచనలు చేశారు.మన దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు 728 బిలియన్ డాలర్లు గా ఉన్నాయి. ఇది ఇరాన్ మీద అమెరికా యుద్ధం మొదలు పెట్టక ముందు. దీనిని మన కరెన్సీలో కనుక చెప్పగలిగితే 69.4 లక్షల కోట్లు. కేవలం రెండు నెలల్లోనే యుద్ధం వల్ల ఫారెక్స్ నిల్వలు 690.69 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ముఖ్యంగా దిగుమతుల బిల్లు 775 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇందులో ముడి చమురు, బంగారం, ఔషధాలు, సెమీ కండక్టర్లు, ఇతర ఉత్పత్తులు ఉన్నాయి. అయితే ఇందులో ఎరువులు, వంట నూనెలు, బంగారం బిల్లు అధికంగా ఉండడం విశేషం. దిగుమతుల మీద విపరీతంగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ఫారెక్స్ నిలువలు ఘోరంగా కరిగిపోతున్నాయి. దీనికి తోడు డాలర్ విలువ మరింత పెరిగిపోతోంది. రూపాయి విలువ తగ్గిపోతుంది. దీనివల్ల ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్మెంట్లు రావడం లేదు. ఫలితంగా దేశం లో ఆర్థికంగా అత్యవసర పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. అందువల్లే నరేంద్ర మోడీ ఈ మాటలు చెప్పారు. దీన్ని ప్రతిపక్షాలు వేరే విధంగా అన్వయించుకున్నప్పటికీ.. అసలు విషయం మాత్రం ఇదే. విదేశీ మారక ద్రవ్య నిలువలు అధికంగా ఉంటే.. మనం అమెరికాను కూడా సులభంగా దాటిపోవచ్చు. దానికి కావాల్సింది మనలో పొదుపు మాత్రమే. దానిని కొనసాగిస్తే ఇక తిరుగుండదు.

========================

# ఎన్నికలపై సర్కార్ మీనమేషాలు

హైదరాబాద్, మే 13,

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పాలకవర్గం పదవీకాలం ముగిసి మూడు నెలలు గడిచిపోయాయి. ఫిబ్రవరి రెండో వారంతోనే బల్దియా కౌన్సిల్ గడువు తీరిపోయింది. ఈలోపు జీహెచ్ఎంసీని రాష్ట్రప్రభుత్వం పరిపాలన సౌల భ్యం కోసం మూడు కార్పొరేషన్లుగా విభజించింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎం సీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా విభజించింది. మూడు కార్పొరేషన్లకూ కమిషనర్లను సైతం నియ మించింది. సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు విడిపోయినప్పటికీ, మొత్తంగా చూస్తే ఆ మూడు జీహెచ్ఎంసీలో భాగమే. గతంలో ఉన్న 150 డివిజన్లను, సర్కార్ ఏకంగా 300కు పెంచింది. వాటిని నిష్పత్తి విధానంలో మూడు కార్పొరేషన్లకు పంచింది. రాష్ట్ర జనాభాలో 25% జనాభా ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలోనే ఉంటుంది. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఆదాయం ఇక్కడి నుంచే వస్తుంది. ఇంత ప్రతిష్ఠాత్మకమైన చోట్ల బల్దియా ఎన్నికలు ఆలస్యం కావడం విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళితే ప్రతికూల ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతున్నదా? లేక ఏదైనా ప్రత్యేక వ్యూహంతోనే తాత్సారం చేస్తోందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తు తున్నాయి. ప్రజాప్రతినిధుల పాలన లేకపోవడంతో ప్రస్తు తం డివిజన్లలో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తున్నది. వారు సామాన్యుల సమస్యలను, అభివృద్ధి పనులను గాలికొదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ, రాష్ట్రప్రభుత్వం నుంచి ఎలాంటి కదలిక కనిపించడం లేదు. మూడు కార్పొరేషన్ల విస్తీర్ణం ప్రస్తుతం 2,053 చదరపు కిలోమీటర్ల మేర ఉంది. ఇంత భారీ విస్తీర్ణం ఉన్న నగరంలో ప్రజలు ఎన్నుకున్న పాలకులు (కార్పొరేటర్లు) లేకుండా అభివృద్ధి సాధ్యం కా దని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి పనులు పాలకుల పర్యవేక్షణ లేక గాడితప్పాయని చెబుతున్నారు. జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్‌కు తిరుగు లేని బలంగా ఉన్నదనేది అందరూ ఒప్పుకునేదే. అందుకు ఇక్కడ ఎమ్మెల్యేల సంఖ్యాబలమే అందుకు నిదర్శనం. అర్బన్ ఓటర్ల విషయానికి వస్తే, బీజేపీ వైపే అనుకూలమైన పవనాలు వీస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. మొదటి నుంచీ అర్బన్ ఓటర్లలో బీజేపీకి పట్టు ఉండటం, కోర్ అర్బన్ ఏరియాల్లో బీజేపీకి ఎమ్మెల్యేలు, ఎంపీలూ ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశమని చెప్పవచ్చు. ఎంపీల విషయానికొస్తే అధికార కాంగ్రెస్ పార్టీకి బలం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేసింది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కే అత్యధిక స్థానాలు దక్కాయిఅయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించడం లేదనే ప్రశ్న తలెత్తుతున్నది. మూడు పార్టీలకు సమానమైన బలం ఉన్నప్పుడు, సాధారణంగా అధికార పార్టీకి మరింత అనుకూలం ఉంటుంది కనుక.. త్వరగా ఎన్నికలు నిర్వహిస్తే, సానుకూల ఫలితాలే వస్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో ప్రత్యేక అధికారుల పాలనలోనే సాగుతున్నది. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ఉంటేనే క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం అవుతాయని వారు అభిప్రాయపడుతున్నారు. మూడు కార్పొరేషన్ల పరిధిలో ఎమ్మెల్యేల సంఖ్య 18 నుంచి 27 మందికి పెరిగే అవకా శం ఉంది. అయినప్పటికీ, కార్పొరేటర్లు లేకపోవడంతో పాలన, అభివృద్ధి పనులపై ప్రతికూల ప్రభావం పడతున్నది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 డివిజన్లు డీలిమిటేషన్‌తో 243 డివిజన్లయ్యాయి. విలీన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలో మరో 57 డివిజన్లు ఏర్పాటయ్యాయి. అలా డివిజన్ల సంఖ్య 300కి పెరిగింది. ముంబైలో గతంలో అమలు చేసిన ఎన్నికల వ్యూహా న్ని హైదరాబాద్‌లోనూ అమలు చేసే అవకాశం ఉందని ప్రచారం సాగుతున్నది. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పరిధిలో 2017 తర్వాత, ఇటీవల బల్దియా ఎన్నికలు జరిగాయి. సుదీర్ఘకాలం తర్వాత, తాజాగా బల్దియా కౌన్సిల్ కొలువదీరింది. దీంతో ఏళ్లపాటు అక్కడ ప్రత్యేక అధికారుల పాలన సాగింది. ఆ సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు డివిజన్ల విభజన, జనాభా సమతుల్యత వంటి సంస్కరణలు చేపట్టాయి. దీనివల్ల రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీ రాజకీయపరమైన ప్రయోజనాలు పొందా యి. ఇప్పుడు హైదరాబాద్ విషయంలోనూ కాంగ్రెస్ సర్కారు అదే మార్గంలో వెళ్లే సంకేతాలు కనిపిస్తున్నాయి. డివిజన్ల సంఖ్య పెంచడం, ఇతర సంస్కరణలు చేపట్టడ చూస్తుంటే, అది బీఎంసీ మాడల్‌లో భాగమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజాప్రతినిధుల పాలన లేకపోవడం పరిణమించింది. ప్రత్యేకాధికారులు సమస్యలను సమర్థంగా పరిష్కరించలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా కొం దరు నాయకులు నగరవాసుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా మేల్కొని ఎన్నికలను త్వరగా నిర్వహించి, పాలనను పట్టాలెక్కించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా నష్టపోయే ప్రమా దం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. నగరవాసుల్లో అసంతృప్తి తీవ్రస్థాయికి చేరుకోకముందే, బల్దియా ఎన్నికల దిశగా అడుగులు వేయాలని సూచిస్తున్నారు. వాస్తవానికి నగరవాసులు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదిస్తుంటా రు. అసలు.. ప్రజాప్రతినిధులే లేకపోతే, తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి.. ఏ అధికారిని సంప్రదించాలి.. తమ సమస్యలకు ఎలా పరిష్కారం లభిస్తుందని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నిర్వ హణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనకడుగు వేయడం వెనుక రాజకీయ లెక్క లు ఉన్నట్లు కనిపిస్తున్నది. డివిజన్ల విభజన, కొత్త ప్రాంతాల కూర్పు వంటి అంశాలను సాకుగా చూపి కాలయాపన చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఓటమి భయంతోనే ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తోందని మండిపడుతున్నాయి. డివిజన్లు పెంచడం, జీహెచ్ఎంసీ పరిధిలోకి కొత్తగా కొన్ని ప్రాంతాలను చేర్చడం, బల్దియాను మూడు కార్పొరేషన్లుగా విభజించడమంతా వ్యూహాత్మక ఆలస్యమేనని ఘంటాపథంగా చెబుతున్నాయి.

# హస్తం పార్టీలో మోడీ చిచ్చు

హైదరాబాద్, మే 13,



మూడోసారి దేశ ప్రధానిగా అధికారం చేపట్టిన తరువాత తొలిసారి హైదరాద్ పర్యటనకలో మోదీ వ్యవహరించిన తీరు తెలంగాణ పొలిటికల్ సర్కిల్ లో పెను దుమారం రేపుతోంది. హైదరాబాద్ లో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు వచ్చిన మోదీ, అదే సభలో మోదీ ప్రక్కనే కూర్చున్న రేవంత్ రెడ్డితో జోకులు, నవ్వులూ చర్చనీయాంశంగా మారాయి. ఒకరినొకరు నవ్వుతూ పలుకరించుకున్న విధానం, పొలిటికల్ షెటర్లతో రేవంత్ ను మోదీ నవ్వించిన తీరు చూస్తున్నవారంతా ఆశ్చర్యపోయారు. రేవంత్ తో ప్రధాని మోదీ ఇంత సన్నిహితంగా మాట్లాడుతున్నారేంటి, ఓ ప్రధాన ప్రతిపక్ష పార్టీ సీఎంతో ఈ పంచ్ లు, నవ్వులేంటంటూ కమలం నేతలు సైతం షాకయ్యారట. మోదీ ఏం చేసినా ఓ లెక్కుంటుంది. అంత తమాషాగా ఏదోకటి మాట్లాడే వ్యక్తి కాదు నరేంద్రమోదీ. ఆచితూచి రాజకీయ విమర్శలు, వ్యూహాత్మక సంభాషణలతో ప్రత్యర్థులను కట్టిపడేయడంలో పొలిటికల్ మాస్టర్ నరేంద్ర మోదీ. అంతలా గంభీరంగా ఉండే మోదీ తాజా హైదరాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డితో సరదాగా మాట్లడుతూ సీఎంను దగ్గర చేసుకునే ప్రయత్నం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. గుజరాత్‌కు ఇచ్చిన నిధులు తెలంగాణకు సైతం ఇవ్వాంటూ వేదికపై మోదీని రేవంత్ రెడ్డి కోరితే, గుజరాత్ కు మించిన అభివృద్ధి కావాలంటే మాతో చేతులు కలపాలంటూ రేవంత్ ను ఆహ్వానించడం, మోదీ ఆఫర్ కు చేతులు జోడించి సీఎం రేవంత్ నవ్వుతున్న విధానం తెలంగాణ పొలిటికల్ సర్కిల్ లో హీట్ పుట్టిస్తున్నాయి. తెలంగాణలో ఇప్పుడున్న ప్రధాన పార్టీలలో మాస్ ఇమేజ్ ఉన్న నాయకులలో ముందు వరుసలో ఉన్నది సీఎం రేవంత్ రెడ్డి. రెండుసార్లు బీఆర్ఎస్ తిరుగులేని అధికారాన్ని సైతం తన మాస్ ఇమేజ్ తో దెబ్బకొట్టి, కాంగ్రెస్ లో చేరిన అతి తక్కువ కాలంలోనే సీఎం పదవి చేపట్టిన మాస్ పొలిటీషియన్ రేవంత్ రెడ్డి. కానీ ఇలా ఓ మాస్ ఇమేజ్ ఉన్న లీడర్ బీజేపీ లో లేరనే చెప్పొచ్చు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ , ఈటెల ఇలా వీరితో బీజేపి ఇప్పటికే చేసిన ప్రయోగాలు అంతగా ఫలించలేదు. ఇన్నాళ్లు బీజేపీలో కాస్త మాస్ ఇమేజ్ ఉన్న బండి సంజయ్ ఇప్పుడు కొడుకు కేసుతో చిక్కుల్లో పడ్డారు. నేతల మధ్య ఈగోలే తెలంగాణలో కమలం కొంపముంచుతున్నాయనే అపవాదు ఉండనే ఉంది. ప్రత్యర్థి పార్టీలో ఉన్న మాస్ నేతపై మోదీ కన్నేశారనే టాక్ వినిపిస్తోంది. వెస్ట్ బెంగాల్ లో అసాధ్యమనుకున్న బీజేపి గెలుపును సుసాధ్యం చేసి చూపించారు నరేంద్ర మోదీ. బీజేపి నెక్ట్స్ టార్గెట్ తెలంగాణలో అధికారం చేపట్టడం, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనైనా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకపోతే , క్యాడర్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. ఇప్పటికే ఇంకా ఎన్నాళ్లు వేరే పెళ్లికి మన డ్యాన్సులంటూ ఒకప్పటి సొంత పార్టీ నేతలే బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. రేవంత్ ను ఇప్పటి నుండే దగ్గర చేసుకుంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలతో రేవంత్ కు ప్రాధాన్యత తగ్గితే, అక్కడ లెక్కలు తేడా వస్తే కమలం గూటికి లాగేయొచ్చనే ఆలోచనలో మోదీ ఉన్నారనే అనుమానాలు బలపడుతున్నాయి. అందుకేనేమో రేవంత్ రెడ్డితో మోదీ ఈ సాన్నిహిత్యం అంటున్నారు పొలిటికల్ విశ్లేషకులు. ఇప్పుడున్న పరిస్థితిలో రేవంత్ కాంగ్రెస్ పార్టీని వీడరు. సీఎం పదవి వదులుకోరు. కానీ భవిష్యత్ లో కాంగ్రెస్ లో కుమ్ములాటలు ఎక్కువైతే, తన కుర్చీకే ఎర్త్ పెట్టే పరిస్థితులు వస్తే, రేవంత్ కు ఉన్న సెకండ్ ఆప్షన్ బీజేపీ అనే ఆలోచనలో రేవంత్ ఉన్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మాతో కలసి రండి రేవంత్ అంటూ మోదీ అన్నప్పుడు రేవంత్ నవ్వులు, స్పందించిన తీరు రేవంత్ కు సైతం మోదీపై ఉన్న అభిమానం బహిర్గతం చేస్తున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ అంటే గ్రూపు రాజకీయాలకు పెట్టని కోట అనే అభిప్రాయలు ఉండనే ఉన్నాయి. సీనియర్లు, జూనియర్లు, సీఎం వర్గం, మరో వర్గం అంటూ వర్గాల కుమ్ములాటలు ఆరని చిచ్చులా నిత్యం రగులుతూనే ఉంటాయి. అయితే తాజాగా రేవంత్ రెడ్డిపై మోదీ చేసిన వ్యాఖ్యలు. మాతో కలిసి రమ్మంటూ, దగ్గరైన తీరు తెంగాణ కాంగ్రెస్ లో గుబులు పుట్టిస్తున్నాయి. మాస్ లీడర్ ఇమేజ్ ఉన్న రేవంత్ ను మోదీ లాగేస్తే మా పరిస్థితేంటనే అభద్రత కాంగ్రెస్ లో నెలకొనేందుకే మోదీ ఇలా మాట్లాడారనే వారు లేకపోలేదు. కావాలనే కాంగ్రెస్ లో గ్రూపు రాజకీయాల పెట్రోల్ లో మోదీ అగ్గి పెట్టారనే వాదనలు వినిపిస్తున్నాయి. అందుకే రేవంత్ కు మోదీ కావాలనే దగ్గరైయ్యారనేవారు లేకపోలేదు. ఇదే అవకాశంగా రేవంత్ రెడ్డికి వ్యతిరేక వర్గం మోదీ, రేవంత్ సాన్నిహిత్యాన్ని కాంగ్రెస్ అధిష్టానం ఎదుట తమకు అనుకూలంగా వాడుకోవడం ద్వారా రేవంత్ ను టార్గెట్ చేస్తారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మొత్తానికి ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్న సమేతను తాజాగా హైదరాబాద్ పర్యటనలో నిజం చేశారు మోదీ. సీఎం రేవంత్ ను నవ్వుతూ దగ్గర చేసుకోవడం ద్వారా అటు బీజేపీకి ఊపు, ఇటు కాంగ్రెస్ లో గుబులు పుట్టించారు.

# తెలంగాణలో ఎన్డీయే కూటమి

హైదరాబాద్, మే 13,

తెలంగాణలో ఎన్డీఏ కూటమి ఏర్పాటు కానుందా అంటే అవును అని జవాబు వస్తోంది. ఇప్పటివరకు చూస్తే అక్కడ మూడు ప్రధాన పార్టీలు రాజకీయం చేస్తూ వస్తున్నాయి. ఒక ప్రధాన పార్టీగా అధికారంలో కాంగ్రెస్ ఉంది, ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఉంది. అయితే మూడో పక్షంగా వెనకన బీజేపీ కనిపిస్తోంది. బీజేపీకి పశ్చిమబెంగాల్ తర్వాత తెలంగాణ మీద ఒక్కసారిగా ఆశలు అధికమవుతున్నాయి. దాంతో 2028 లో జరిగే ఈ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కమలం జెండాను ఎగరవేయాలని బిజెపి కృత నిశ్చయంతో ఉంది. ఈ నేపథ్యంలోనే పశ్చిమబెంగాల్ లో కొత్త ప్రభుత్వాన్ని బీజేపీ స్థాపించిన తర్వాత నేరుగా ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణలో ల్యాండ్ అయ్యారు. ఆయన తెలంగాణాకు వస్తూనే తన వ్యూహాలను అమలులో తెచ్చినట్లుగా చెబుతున్నారు. బీజేపీకి ఆంధ్రాలో ఎన్డీఏ మిత్రులుగా ఉన్న తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ లని వారి ఇళ్లలోనే మోడీ వచ్చి కలిశారు. వాళ్లతో చాలా సేపు చర్చలు జరిపారు. అయితే ఈ చర్చలలో వర్తమాన రాజకీయ విషయాలు చాలానే వచ్చేయని అంతా అనుకుంటున్నారు. వచ్చే ఎన్నికలలో తెలంగాణలో కూడా ఎన్డీఏ కూటమి ఏర్పాటు చేసి అధికారంలోకి రావాలన్నద్దే బీజేపీ పెద్దల లక్ష్యంగా కనిపిస్తోంది ఇక దానికి ముందు అంటే కొద్ది నెలల్లో జరగబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి పోటీ పడాలని చూస్తోంది అని అంటున్నారు. అంటే ఇది లిట్మస్ టెస్ట్ లాంటిది అన్న మాట. మూడు పార్టీలకు జనాదరణ ఎలా ఉంది అన్నది ఈ ఎన్నికల్లో తెలుస్తుంది అని భావిస్తున్నారు. ఆంధ్ర పార్టీలుగా ముద్రపడ్డ జనసేన టిడిపిలను జిహెచ్ఎంసి ఎన్నికల్లో జనాలు కనుక ఆదరిస్తే ఖచ్చితంగా 2028 నాటికి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కూటమి పోటీకి తయారుగా ఉంటుంది అని అంటున్నారు. ఇక చూస్తే ఇప్పటివరకు తెలంగాణ బిజెపి నేతలకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన పార్టీ పెద్దలు ఇప్పుడు స్వయంగా తావే అన్నీ పర్యవేక్షించాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. ఎందుకంటే తెలంగాణ బిజెపి నేతలు పూర్తిస్థాయిలో పార్టీని బలోపేతం చేయలేకపోతున్నారు అన్న నిర్ణయానికి కేంద్ర పెద్దలు వచ్చినట్టుగా చెబుతున్నారుతెలంగాణాలో ఎవరితోనూ పొత్తులు వద్దు తామే సొంతంగా అధికారులను బిజెపిని తెస్తామని చెప్పిన కాషాయం నేతలు తలోదిక్కుగా విడిపోయి వర్గ పోరుని పెంచి పోషిస్తున్నారు. పార్టీని బలోపేతం చేసే చర్యలకు దిగటం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నాళ్లు గడిచిన బిజెపి ప్రతిపక్షంలోనే వెనక సీట్ లోనే ఉంటుంది అని కేంద్ర పెద్దలు భావిస్తున్నారు. దాంతో గేర్ మార్చి స్పీడ్ పెంచాలని స్వయంగా నరేంద్ర మోడీ నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే తెలుగుదేశం పార్టీని జనసేనను కలుపుకుంటే తెలంగాణ అంతటా క్షేత్రస్థాయిలో బిజెపికి అవసరమైన బలం సమకూరుతుందని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ని బీఆర్ఎస్ ని గట్టిగా ఢీ కొట్టి తాము అధికారంలో వచ్చేందుకు వీలు అవుతుందని బీజేపీ పెద్దలు నమ్మకంగా ఉన్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో బీజేపీ పెద్దలు టీడీపీతో పొత్తుల విషయంలో తెలంగాణ బిజెపి నేతల సూచనలు కాని వాళ్ళ అభ్యంతరాలను కానీ పట్టించుకునే అవకాశాలు ఏమాత్రం కనిపించట్లేదు. చంద్రబాబుతో పొత్తు వద్దు అని తెలంగాణ బిజెపి నేతలు గతంలో చెప్పి ఉన్నా కానీ ఇప్పుడు ఆ పరిస్థితి అయితే లేదు. కేంద్ర బీజేపీ నేతలు చంద్రబాబుతోనూ పవన్ తోనూ పొత్తుకు కుదిరించే పనిలో ఉన్నారని అంటున్నారు. దాంతో తెలంగాణలోనూ ఎన్డీఏ కూటమి రాబోయే ఎన్నికలకు సంసిద్ధమైన సూచనలు స్పష్టంగా కనిపిస్తుంది దీంతో తెలంగాణ రాజకీయంలో పెను మార్పులు సంభవిస్తాయని అంతా అంటున్నారు.

# తెలంగాణలో స్వీపర్ కు 2 లక్షలు..

## ఒక్కో పోస్టుకు 800 మంది దరఖాస్తు

హైదరాబాద్, మే 13, (

డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి, సాఫ్ట్‌వేర్ ఆఫీసుల చుట్టూ కాళు అరిగేలా తిరిగి, నెలకు ముప్పై వేల జీతం కోసం నానా తంటాలు పడే కుర్రాళ్లకు ఈ వార్త వింటే గుండె ఆగుతుందేమో. ఈ వార్త విన్న తర్వాత రాష్ట్రంలోని నిరుద్యోగులంతా రెజ్యూమ్ లో స్కిల్స్ వద్ద 'జావా, పైథాన్' తీసేసి 'స్వీపింగ్, క్లీనింగ్' అని మార్చుకునే పనిలో పడుతారు కావచ్చు. ఏ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కలలో కూడా ఊహించని ఈ వేతనాల మాయాజాలం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ ఒక స్వీపర్ జీతం నెలకు ఎంత ఉంటుంది ప్రభుత్వ రంగ సంస్థనా.. ప్రైవేట్ సెక్టారా.. రెడింటికీ తేడా ఉంటుంది.. ప్రభుత్వ రంగమే అయినా ఎంత ఉంటుంది.. మా అంటే రూ. 10వేలు, ఈ కాలంలో పది వేల పనే లేదు.. సరే.. రూ. 20 నుంచి రూ. 30 వేల వరకు ఒకే.. కానీ ఇక్కడ అంత కాదు ఏకంగా రూ. 2 లక్షలు అంటే ఆశ్చర్యపోవాల్సిందే. మన దేశంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల జీతాల కంటే కూడా ఇవి ఎక్కువగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఇటీవల జరిగిన 16వ ఆర్థిక సంఘం రివ్యూ మీటింగ్‌లో ఈ ఆసక్తికరమైన నిజాలను వెల్లడించారుతెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో భారీ మార్పులు వచ్చాయి. ముఖ్యంగా విద్యుత్ రంగ సంస్థలైన జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో వేతనాలు ఇతర శాఖల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. ఎవరికి ఎంత జీతం? రివ్యూ మీటింగ్‌లో వెల్లడైన వివరాల ప్రకారం.. సుమారు 20-30 ఏళ్ల సర్వీస్ ఉన్న సీనియర్ క్లాస్-4 ఉద్యోగులు (స్వీపర్లు, అటెండర్లు) నెలకు రూ. 2 లక్షల వరకు జీతం అందుకుంటున్నారు. పవర్ యుటిలిటీస్‌లో పనిచేసే చీఫ్ ఇంజినీర్ స్థాయి అధికారుల వేతనం నెలకు ఏకంగా రూ. 7 లక్షల వరకు ఉంది. జీహెచ్ఎంసీ వంటి సంస్థల్లోని రెగ్యులర్ శానిటేషన్ వర్కర్లు కూడా సుమారు రూ. 70,000 నుంచి రూ. లక్ష వరకు సంపాదిస్తున్నారు. ఇంత జీతాలకు కారణం.. ఈ శాఖలో వేతనాలు ఇంత భారీగా ఉండటానికి కొన్ని ప్రత్యేక కారణాలు ఉన్నాయి. సాధారణ ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లకోసారి పీఆర్సీ అమలు జరుగుతుంటే, విద్యుత్ శాఖలో ప్రతి నాలుగేళ్లకోసారి వేతన సవరణ జరుగుతుంది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి జరిగిన వరుస వేతన సవరణలు, డీఏ (ఆం) పెరుగుదలలు ఈ జీతాలను ఐఏఎస్ అధికారుల వేతనాల కంటే పైకి తీసుకెళ్లాయి. ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల సగటు వయస్సు 50 ఏళ్లు ఉండటం వల్ల, సుదీర్ఘ సర్వీసులో వారికి వచ్చిన ఇంక్రిమెంట్లు జీతాలను ఈ స్థాయికి చేర్చాయి. జీతాల పెరుగుదల వల్ల రాష్ట్ర ఖజానాపై ఒత్తిడి పెరుగుతోందని సీఎస్ రామకృష్ణారావు అభిప్రాయపడ్డారు. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు నెలకు జీతాలు, పెన్షన్ల కోసం రూ. 1,500 కోట్లు ఖర్చు అయ్యేది, ప్రస్తుతం అది రూ. 6,000 కోట్లకు చేరింది. గత పదేళ్లలో రాష్ట్రం చేసిన మొత్తం రూ. 15 లక్షల కోట్ల వ్యయంలో దాదాపు రూ. 12 లక్షల కోట్లు కేవలం జీతాలు, పెన్షన్లు, అప్పుల చెల్లింపులకే ఖర్చయ్యాయి. ఇంత భారీ వేతనాలు ఉండడం వల్లే ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన క్రేజ్ పెరిగింది. ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చిన 563 గ్రూప్-1 పోస్టుల కోసం ఒక్కో పోస్టుకు సగటున 799 మంది అభ్యర్థులు పోటీ పడటం దీనికి నిదర్శనం

=================చీచీఅఅ

# వేసవి సెలవులు ఇవ్వని కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల పై తక్షణమే చర్యలు తీసుకోవాలి

ఆళ్లగడ్డ మే 13, (

ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లతీఫ్ విద్యార్థులతో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లతీఫ్ డిమాండ్ చేశారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో ప్రస్తుతం 41 నుండి 43 డిగ్రీల వరకు తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్నిపణంగా పెట్టి తరగతులు నిర్వహించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఆళ్లగడ్డ ప్రాంతాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించడం, రెండో సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు ఈఎపిసెట్(ఎంసెట్)పేరుతో ప్రత్యేక తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. ఇంటర్ బోర్డు మార్గదర్శకా లను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న ఈ తరగతులు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపడమేకాకుండా వారి ఆరోగ్యానికి ప్రమాదకరమ ని హెచ్చరించారు. ఇంటర్ జూనియర్ కళాశాలలకు ఏప్రిల్ 24 నుండి జూన్ 1 వరకు సెలవులు మంజూరు చేసినట్లు ఇంటర్ బోర్డు స్పష్టం చేసినప్పటికీ అవి పట్టించుకోకపోవడం, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యాహరించడం విడ్డురం గా ఉందన్నారు. దీనివల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరుగున పడే అవకాశం ఉందన్నారు.

# వేసవి సెలవులలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు.

## విద్యా ప్రణాళిక షెడ్యూల్ ను వాయిదా వేయండి

## యుటిఎఫ్ కడప జిల్లా శాఖ



బద్వేలు మే 13

విద్యా ప్రణాళిక రూపకల్పన పేరుతో, ఫెయిల్ అయిన పదవ తరగతి విద్యార్థులకు రెమిడీయల్ తరగతుల పేరుతో వేసవి సెలవులలో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం తగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు విమర్శించారు. మంగళవారం సాయంత్రం కడపలోని యుటిఎఫ్ భవన్లో ఆ సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులు మొదలైనప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుల సెలవులను హరిస్తూ ఏదో ఒక రకంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు క్లాసులు నిర్వహించాలని ఆదేశాలిచ్చారని, మరోవైపు వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల, ఆవాస ప్రాంతం, క్లస్టర్, మండల స్థాయి విద్యా ప్రణాళికలను వెంటనే రూపొందించాలని షెడ్యూల్ జారీ చేశారన్నారు. మే 11వ తేదీ పాఠశాల స్థాయి ఆవాస ప్రాంత ప్రణాళికలు రూపొందించాలని, 12వ తేదీ గ్రామసభలు నిర్వహించాలని, 13వ తేది గ్రామపంచాయతీ పరిధిలో ప్రణాళికలు ఆమోదింప చేసుకోవాలని,14వ తేది క్లస్టర్ స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలని, 15 వ తేదీ మండల స్థాయిలో విద్యా ప్రణాళికలు రూపొందించాలని, 16వ తేదీ మండల స్థాయిలో రూపొందించిన ప్రణాళికలో జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారని వారు పేర్కొన్నారు. విద్యాశాఖ వెకేషన్ డిపార్ట్మెంట్ అని, అయితే కొంతకాలంగా విద్యాశాఖ అధికారులు విద్యాశాఖను వెకేషన్ డిపార్ట్మెంట్ అనే విషయాన్ని మరిచినట్టు ఉన్నారని వారు విమర్శించారు. గత సంవత్సరం నవంబర్, డిసెంబర్ మాసంలోనే రూపొందించాల్సిన విద్యా ప్రణాళికలను, అప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు వేసవి సెలవులలో రూపొందించాలనడం పనిగట్టుకొని ఉపాధ్యాయులను వేధించడమేనని వారు ఆరోపించారు. వేసవి సెలవులలో ఉపాధ్యాయులు సొంత గ్రామాలకు వెళ్లడం, వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు వెళ్లడం, సుదూర ప్రాంతాలకు ప్రయాణాలు పెట్టుకోవడం సహజమన్నారు. అలాంటి సందర్భంలో అకస్మాత్తుగా విద్యా ప్రణాళికలను రూపొందించే షెడ్యూల్ ను విడుదల చేసి అమలు చేయాలనడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ జారీచేసిన ఈ షెడ్యూల్ ను తక్షణమే ఉపసంహరించుకొని జూన్ మాసంలో నిర్వహించే విధంగా షెడ్యూల్ రూపొందించాలని వారు కోరారు. విద్యాశాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు లేకుండా అప్పటికప్పుడు రూపొందించి ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం వల్ల సత్ఫలితాలు రావనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహిస్తున్న సమావేశాలలో ఇలాంటి ప్రణాళికలపై చర్చించి షెడ్యూల్ ను ప్రకటించి అమలు చేయడం వల్ల విద్యాశాఖలో మెరుగైన ఫలితాలను సాధించవచ్చని హితవు పలికారు. ప్రభుత్వ పాఠశాలలలో అడ్మిషన్లు నిర్వహించే కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ, అడ్మిషన్ల ప్రక్రియను చేపడుతున్నారని వారు తెలిపారు ఉపాధ్యాయులను ఏదో ఒక రకంగా ఒత్తిడికి గురి చేసే కార్యాచరణను విద్యాశాఖ అధికారులు విడనాడాలని వారు కోరారు. ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పకపోతే ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతామని, ప్రభుత్వం ప్రకటించిన విద్యా ప్రణాళిక షెడ్యూల్ ను బహిష్కరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు జి.గోపీనాథ్, జె.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.మహబూబ్ బాషా, జి.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

# తిరుపతి ట్రాఫిక్ కష్టాలకు చెక్

## ఎంపీ గురుమూర్తి కృషితో రైల్వే అండర్ బ్రిడ్జి

తిరుపతి: మే 13, (

ఆధ్యాత్మిక నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కీలకమైన ఎల్సీ నం.107 పాత హీరో హోండా షోరూం వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జ్ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్న ఈ అండర్ బ్రిడ్జ్ ద్వారా నగర ట్రాఫిక్‌కు భారీ ఉపశమనం కలగనుంది. ఇదే సమయంలో కొత్తగా మంజూరు అయిన అప్రోచ్ రోడ్డు పనులు కూడా ప్రారంభం కానున్నాయి. ఈ అండర్ బ్రిడ్జ్ పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తే తిరుపతి నగరంలో ట్రాఫిక్ మరింత మెరుగుపడుతుంది. 2022లోనే ఎంపీ చొరవ భవిష్యత్ ట్రాఫిక్ రద్దీని గుర్తించి ఎంపీ మద్దిల గురుమూర్తి తాను ఎంపీగా ఎన్నికైన తొలినాళ్లలో 2022 సంవత్సరంలోనే ఎల్సీ నం.107 వద్ద అండర్ బ్రిడ్జ్ నిర్మాణం అత్యవసరమని దక్షిణ మధ్య రైల్వే అధికారులకు తెలియజేశారు. తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంగా ఉండడం, లెవల్ క్రాసింగ్ వద్ద తరచూ గేట్లు మూయడం వలన నగరంలో ట్రాఫిక్ భారీగా నిలిచిపోవడం, ముఖ్యంగా అత్యవసర సేవలకు అంతరాయం కలగడం వంటి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి పట్టణానికి ఓ వైపు వాణిజ్య కేంద్రాలు, హోటళ్లు, విద్యాసంస్థలు ఉండగా, మరో వైపున వేలాది కుటుంబాలు నివసించడం వల్ల ఈ మార్గం అత్యంత కీలకమని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తరువాత 2023లో ఈ సమస్యను మరింత ప్రాధాన్యతతో తీసుకుని, రోడ్డు వెడల్పు చేసే అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. రైల్వే గేట్లు మూసినప్పుడు ప్రధాన రహదారి పూర్తిగా బ్లాక్ అవుతూ అంబులెన్సులు సైతం సమయానికి ఆసుపత్రులకు చేరలేని పరిస్థితిని ఆయన అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో రైల్వే శాఖ కూడా సమస్య తీవ్రతను గుర్తించి, ఎల్సీ నం.107 వద్ద రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి నిర్ణయం తీసుకుంది. అయితే, అండర్ బ్రిడ్జ్‌కు ఒక వైపు మాత్రమే అప్రోచ్ రోడ్ ఉండటం వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశాన్ని గుర్తించి, మరో వైపు అదనపు అప్రోచ్ రోడ్ అవసరాన్ని 2025లో ప్రస్తావించారు. తిరుపతి నగరం వేగంగా విస్తరిస్తుండటం, మంగళం, కొత్త రహదారుల అభివృద్ధి వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర పరిష్కారం అవసరమని వివరించారు. దీనికి అనుగుణంగా రైల్వే శాఖ కూడా అదనపు అప్రోచ్ రోడ్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఆర్‌యూబీ నిర్మాణం పూర్తి దశకు చేరుకోవడం, అప్రోచ్ రోడ్ల పనులు ప్రారంభం కానుండటంతో తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. రైల్వే గేట్ల కారణంగా ఏర్పడే ఆలస్యం పూర్తిగా తొలగిపోవడంతో పాటు, అత్యవసర సేవలు వేగంగా అందుబాటులోకి రావడం, ప్రజలకు సురక్షితమైన ప్రయాణం కలగడం వంటి అనేక ప్రయోజనాలు అందనున్నాయి. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి నిరంతరం అనుసరణతో, దశలవారీగా సమస్యను ముందుకు తీసుకెళ్లి, సబ్‌వే ప్రతిపాదన నుండి ఆర్‌యూబీ నిర్మాణం వరకు, అనంతరం అదనపు అప్రోచ్ రోడ్ల ఆమోదం వరకు సాధించిన ఈ విజయాన్ని ప్రజలు అభినందిస్తున్నారు. నగర అభివృద్ధి, ప్రజల సౌకర్యం దృష్ట్యా ఆయన చేసిన కృషి తిరుపతి ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో కీలక మైలురాయిగా నిలిచింది.

# బక్రీద్ పండుగ కు రాష్ట్రవ్యాప్తంగా

## కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## డీజీపీ.సీవీ ఆనంద్,

**.చెక్‌పోస్టులు, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా.**

**బక్రీద్ పండుగ శాంతిభద్రతలపై డీజీపీ సీవీ ఆనంద్, సమీక్ష**



బక్రీద్ పండుగను రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా శాంతియుతంగా, పరస్పర గౌరవ భావంతో నిర్వహించేందుకు ప్రతి పోలీస్ అధికారి అప్రమత్తంగా పని చేయాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్, అన్నారు . సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు, విద్వేషపూరిత సందేశాలపై వెంటనే స్పందించాలి. ప్రజల భద్రత, సామరస్య పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మే 27వ తేదీన జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతల నిర్వహణపై రాష్ట్ర పోలీసు శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర డిజిపి సీవీ, ఆనంద్, స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి దృశ్య సమీక్ష సమావేశంలో ఆయన భద్రతా ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ దృశ్య సమీక్ష సమావేశంలో వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయం నుండి వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్.పోలీసు అధికారులతో కలిసి పాల్గొని, జిల్లాలో బక్రీద్ సందర్భంగా చేపడుతున్న భద్రతా చర్యలు, ప్రత్యేక బందోబస్తు ప్రణాళికలు, చెక్‌పోస్టుల పర్యవేక్షణ, పోలీస్ బృందాల మోహరింపు తదితర అంశాలను డీజీపీ కి వివరించారు. ఈ సందర్భంగా డిజీపీ గారు మాట్లాడుతూ.. బక్రీద్ పండుగను పూర్తిగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక బందోబస్తు, సున్నిత ప్రాంతాల్లో అదనపు పోలీస్ పికెటింగ్, చెక్‌పోస్టుల ఏర్పాటు, రాత్రి గస్తీ, డ్రోన్ మరియు సీసీ కెమెరాల పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టాలని డీజీపీ ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారాలపై ప్రత్యేక సైబర్ నిఘా ఏర్పాటు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, సామాజిక సామరస్య పరిరక్షణ పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న డీజీపీ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం ఇవ్వకుండా జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై కఠిన నిఘా కొనసాగించాలని ఆదేశించారు

# కిశోర బాలికలను చైతన్య పరచడానికే కిషోరి వికాసం కార్యక్రమం



తుగ్గలి: మే 13

: రాష్ట్రంలోని గల కిశోర బాలికలందరినీ చైతన్య పరచడానికే రాష్ట్ర ప్రభుత్వం మే 1వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు కిషోరి వికాసం 2026 కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ శకుంతల తెలియజేశారు. బుధవారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి లోని అంగన్వాడీ సెంటర్ 2 నందు కిషోరి వికాసం కార్యక్రమంపై వేసవి సెలవులలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. కిషోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కిషోర బాలికలకు జీవన నైపుణ్యాల గురించి, విద్య యొక్క ప్రాధాన్యతపై వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కిషోర బాలికల యొక్క స్వీయ సంరక్షణ గురించి వారు అవగాహన కల్పించారు. ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండడం, మంచి నిర్ణయాలను తీసుకోవడం, ఇతరులతో స్నేహపూర్వకంగా మేలగడం, తమ సమస్యలను పరిష్కరించే విధంగా ఆలోచించడం వంటి వాటిపై వారు అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రస్తుత సమాజంలో నిర్వహిస్తున్న బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టే విధంగా ప్రజలు కృషి చేయాలని వారు తెలియజేశారు. తల్లిదండ్రులు కూడా ప్రస్తుత సమాజంలో జరుగుతున్నటువంటి విషయాలపై బాలికలకు అవగాహన కల్పించాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జ్యోతి, రంజాని, జయలక్ష్మి, కాంతమ్మ, డిసిపియు సిబ్బంది, కిశోర బాలికలు, బాలికల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# సోనియాతో ఢీకొని ఉప ఎన్నికల్లో చరిత్ర సృష్టించిన దమ్మున్నోడు వై.ఎస జగన్.వై.ఎస్.

## కుటుంబంతో పెట్టుకుంటే రాజకీయ సమాదే అని తేల్చిన ఎన్నికలివే

కడప మే 13

దివంగత ముఖ్యమంత్రి, తన తండ్రి డా॥వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి మరణాన్ని తట్టుకోలేక మరణించిన వారందరినీ పరామర్శించేందుకు వై.ఎస్ జగన్ ఓదార్పు యాత్ర చేపడితే కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ దానిని అడ్డుకుని, సిబిఐ కేసులు పెట్టి, తీవ్ర వత్తిడులకు గురిచేసినా, వై.ఎస్. కుటుంబాన్ని బలహీన పరచాలని కుట్ర చేసినా... కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నా, తన సత్తా చూపించేందుకు... వై.ఎస్. కుటుంబ చరిత్రను చాటేందుకు తాను లోక్ సభ (పార్లమెంట్) సభ్యత్వానికి రాజీనామా చేసి... రికార్డు మెజారిటీతో తాను గెలవడమే కాకుండా, కాంగ్రెస్ కుట్రలు చేసినా తన తల్లి వై.ఎస్ విజయమ్మ ను రికార్డు మెజారిటీతో గెలిపించి కడప జిల్లా చరిత్రలో తన సత్తాను చాటిన దమ్మున్నోడు వైయస్సార్ సిపి చీఫ్ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అని వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కొనియాడారు. కడప నగరంలోని వైయస్సార్ సిపి జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ సోనియా గాంధీని, ఢిల్లీ సింహాసనాన్ని గడగడలాడించి లోక్ సభ సభ్యుడిగా వై.ఎస్ జగన్ 5,45,672 ఓట్లు రికార్డు మెజారిటీతో గెలవడమే కాక... తన బాబాయ్ వివేకానంద రెడ్డిని కాంగ్రెస్ తరపున పోటీ చేయించి, దుష్ట పన్నాగంతో ఓట్లు చీల్చినప్పటికీ ఆనాడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్,టి.డి.పి లను ఓడించి పులివెందల ఎమ్మెల్యేగా 81,373 ఓట్లతో తన తల్లి వై.ఎస్ విజయమ్మ ను గెలిపించుకుని ఢిల్లీతో కడప పౌరుషాన్ని చూపించి తన సత్తాను చాటిన పోరాటయోధుడు వై.ఎస్ జగన్ అని నిరూపించారు అన్నారు. ఆ చారిత్రాత్మక ఘట్టానికి 13 మే 2026 బుధవారం నాటికి అంటే నేటికీ 15 ఏళ్లు అయిందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చరిత్ర సృష్టించిన రోజు అని వైయస్సార్ సిపి శ్రేణులు, నేతలందరూ గుర్తించుకోవాలని అదే మనకు స్ఫూర్తి దాయకమని ఆయన తెలిపారు. వై.ఎస్ కుటుంబానికి చేసిన నమ్మకద్రోహానికి, నాడు వై.ఎస్ జగన్ ను 16 నెలలు అన్యాయంగా, అక్రమ కేసులు పెట్టిన పాపానికి నేటికీ కాంగ్రెస్ కోలుకోలేని స్థితికి చేరి భారీ మూల్యం చెల్లించుకుందన్నారు. వై.ఎస్ కుటుంబంతో పెట్టుకున్న వారికి రాజకీయ సమాదేనన్న దానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ఇది వై.ఎస్ జగన్ చరిస్మాకు, ధైర్య సాహసాలకు, నీతి, నిజాయితీ, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కూటమినేతలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మొదలు కూటమి నేతలంతా వై.ఎస్ జగన్ పేరు, నామస్మరణ లేకుండా వీరి ప్రసంగాలు విన్నారా? వై.ఎస్ జగన్ పేరు లేకుండా ఆంధ్రజ్యోతి, ఈనాడులు బ్యానర్ ఐటం వార్తలు రాశారా? వాటిని మీరు చూశారా? వై.ఎస్ జగన్ నామస్మరణ లేకుండా కూటమి సమావేశాలు, వై.ఎస్ జగన్ పేరు లేకుండా పచ్చ మీడియా డిబేట్ లు ఏనాడైనా చూశారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇది వై.ఎస్ జగన్ అంటే వారందరికీ ఉన్న భయానికి ప్రత్యక్ష నిదర్శనం కాదా? అని ఆయన నిలదీశారు.


# పదిలో ప్రతిభకు ప్రోత్సాహం.

## -చిన్నకేశంపల్లె విద్యార్థులకు టిడిపి సమన్వయకర్త రితీష్ రెడ్డి నగదు బహుమతి.

బద్వేలు మే 13

పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త కె.రితీష్ రెడ్డి ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందజేశారు. బుధవారం సాయంత్రం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సందర్శించిన రితీష్ రెడ్డి ఆ పాఠశాలలో 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన టి.అభిషేక్(551), ఎ.దీక్షిత(535), కె.శ్రీదేవి లకు ఒక్కొక్కరికి 5000 చొప్పున ప్రోత్సాహ బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా రితీష్ రెడ్డి మాట్లాడుతూ సరైన అవకాశాలు కల్పిస్తే ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తామని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిరూపించారన్నారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుత ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల పై ప్రత్యేక దృష్టి సారించారని, విద్యార్థులకు ప్రభుత్వం నుండి అందాల్సిన సంక్షేమ పథకాలన్నింటినీ సకాలంలోనే అందజేశారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి , సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతికి కృషి చేశారని తెలిపారు. చిన్నకేశంపల్లె ప్రభుత్వ పాఠశాలలో చక్కటి మార్కులతో రాణించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల ప్రగతికి కృషిచేసిన ప్రధానోపాధ్యాయుడిని, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. వందరోజుల యాక్షన్ ప్లాన్ సత్ఫలితాలను సాధించేందుకు దోహదపడిందని ఆయన పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా చిన్నకేశం పల్లెలో అద్భుత ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి బయన పల్లె నుండి శ్రీనివాసపురం మీదుగా చిన్న కేశంపల్లె, చెన్నం పల్లె వరకు ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంజి పెంచలయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రితీష్ రెడ్డి అభినందించడం ఆనందంగా ఉందన్నారు.

# పునర్ శ్రవణ ప్రాప్తిరస్తు



కాక్లియర్ ఇంప్లాంట్. అత్యంత విజయవంతమైన వైద్య ఆవిష్కరణల్లో ఒకటి. బ్రహ్మ చెవుడు గలవారికి తిరిగి వినికిడిని రప్పించటంలో.. మాటలను అర్థం చేసుకోవటానికి, చుట్టుపక్కల ప్రపంచంతో మమేకం కావటంలో ఎంతగానో తోడ్పడుతోంది. ఒకప్పటికన్నా ఇప్పుడు ఇంప్లాంట్స్ అధునాతన రూపం సంతరించుకున్నాయి. రాన్రానూ వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చెందుతూ వస్తున్నాయి. వీటి అమరిక అవసరమైనవారి పరిధి సైతం విస్తరిస్తోంది. ఫలితంగా ఇప్పుడు కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స వయసుతో నిమిత్తం లేకుండా.. శిశువుల దగ్గరి నుంచి వృద్ధుల వరకూ ఎందరికో పునర్ శ్రవణ భాగ్యాన్ని ప్రసాదిస్తోంది. దీనిపై సమగ్ర కథనం ఈవారం మీకోసం.

మనం అప్రయత్నంగా శబ్దాలను వింటుంటాం గానీ ఇదో సంక్లిష్ట ప్రక్రియ. ఇందుకోసం చెవిలో పెద్ద తతంగమే నడుస్తుంది. బయటి చెవి నుంచి వచ్చే శబ్దాలకు కర్ణభేరి స్పందించటంతో వినికిడి ప్రక్రియ మొదలవుతుంది. కర్ణభేరి కంపించగానే మధ్య చెవిలోని మూడు గొలుసు ఎముకలూ ప్రకంపిస్తాయి. వీటిల్లో చివరి ఎముక లోపలి చెవిలోని వర్తులాకార గొట్టం (కాక్లియా)తో అనుసంధానమవుతుంది. ఈ కాక్లియాలోని ద్రవంలో రోమకణాలు తేలియాడుతూ ఉంటాయి. కర్ణభేరి, గొలుసు ఎముకల కంపనాలకు ద్రవంలో సున్నితమైన అలలు లేస్తాయి. అప్పుడు రోమకణాలు ఊగటం, వీటి నుంచి విద్యుత్ ప్రచోదనాలు ఉత్పత్తి కావటం, అవి శ్రవణ నాడి ద్వారా మెదడుకు చేరుకోవటం, శబ్దాన్ని విన్న అనుభూతి కలగటం అంతా ఒక క్రమపద్ధతిలో సాగుతుంది. ఇందులో ఎక్కడ సమస్య తలెత్తినా వినికిడి లోపిస్తుంది. అయితే లోపలి చెవి సమస్యలు చికిత్సకు ఒక పట్టాన లొంగవు. ఇక్కడే కాక్లియర్ ఇంప్లాంట్ ఆదుకుంటుంది. ఇది వినికిడి సాధనాలతో ఫలితం లేనివారికి అద్భుత వరంగా పనిచేస్తుంది.

ఎలా పనిచేస్తుంది?

కాక్లియర్ ఇంప్లాంట్‌ను కొందరు వినికిడి సాధనమని భావిస్తుంటారు. వినికిడి సాధనాలు శబ్దాల తీవ్రతను మాత్రమే పెంచుతాయి. కానీ కాక్లియర్ ఇంప్లాంట్ అలా కాదు. వినికిడికి మూలమైన శ్రవణనాడిని ప్రేరేపించి, శబ్దాలు వినిపించేలా చేస్తుంది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. రిసీవర్ స్టిమ్యులేటర్ భాగాన్ని చెవి వెనకాల ఆపరేషన్ చేసి, లోపల అమరుస్తారు. దీనికి గల ఎలక్ట్రోడ్ తీగలను కర్ణభేరి కింది నుంచి, కాక్లియాలోకి ప్రవేశపెడతారు. మైక్రోఫోన్, స్పీచ్ ప్రాసెసర్, ట్రాన్స్‌మిటర్‌తో కూడిన రెండో భాగాన్నేమో చెవి వెనకాల బయట అమరుస్తారు. లోపలి, వెలుపలి భాగాలు రెండూ వీటిల్లోని అయస్కాంతం సాయంతో పట్టుకొని ఉంటాయి. వెలుపలి భాగంలోని మైక్రోఫోన్ గ్రహించిన ధ్వనులు సంకేతాలుగా మారి, లోపల అమర్చిన భాగానికి ప్రసారమవుతాయి. ఇవి విద్యుత్ ప్రచోదనాలుగా మారి, ఎలక్ట్రోడ్ తీగ ద్వారా క్లాకియాలోకి చేరతాయి. అప్పుడు శ్రవణ నాడీ కణాలు ప్రేరేపితమై ఆ సమాచారాన్ని మెదడుకు పంపిస్తాయి. వీటిని మెదడు విశ్లేషించి, ధ్వని రూపంలో వినిపిస్తుంది.

చెవి భాగంలో మత్తుతోనే

శిశువులకు, చాలామంది పిల్లలకు ఇప్పటికీ జనరల్ అనస్థీషియాతో చేసే శస్త్రచికిత్సే ప్రామాణికం. అయితే ఇప్పుడు పెద్దవారిలో కొందరికి చెవి వెనక భాగానికి మాత్రమే లోకల్‌గా మత్తు ఇచ్చి శస్త్రచికిత్స చేయటమూ సాధ్యమవుతోంది. గుండె, ఊపిరితిత్తి, కిడ్నీ, కాలేయ జబ్బుల వంటివి గలవారికి మత్తుమందుతో ముడిపడిన దుష్ప్రభావాలు తగ్గటానికి, త్వరగా కోలుకోవటానికిది ఉపయోగపడుతుంది. (మేం తొమ్మిదేళ్ల క్రితమే తొలిసారిగా లోకల్ అనస్థీషియాతో ఒకే ఊపిరితిత్తి గల వ్యక్తికి కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స చేశాం. ఇప్పటివరకూ జనరల్ అనస్థీషియా ఇవ్వటం కుదరని 30 మందికి ఈ పద్ధతిని అనుసరించాం. మనదేశంలో లోకల్ అనస్థీషియాతో ఇంత ఎక్కువ సంఖ్యలో కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చటం మరెక్కడా లేదు. ఒకరికి ఒకేసారి రెండు చెవుల్లోనూ ఇంప్లాంట్ అమర్చాం కూడా).

ముప్పులు తక్కువే

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సతో పెద్దగా ముప్పులేవీ ఉండవనే చెప్పాలి. చాలా అరుదుగా ఇన్‌ఫెక్షన్ రావొచ్చు. కొందరికి పరికరం విఫలం కావొచ్చు. శస్త్రచికిత్సకు ముందు మెదడుపొర వాపు రాకుండా న్యూమోవాక్, హిబ్ టీకాలు తీసుకోవటం తప్పనిసరి.

ఎవరికి అవసరం?

పుట్టుకతో గానీ మాటలు వచ్చిన తర్వాత గానీ వినికిడి లోపించిన పిల్లలకు, పెద్దలకు.

రెండు చెవుల్లోనూ తీవ్రమైన వినికిడిలోపం గలవారికి (ప్యూర్‌టోన్ ఆడియో పరీక్షలో సగటున 70-80 డెసిబెల్స్‌కు మించి లోపం ఉన్నవారికి).

వినికిడి సాధనాలతో అంతగా ఫలితం కనిపించనివారికి.

పదాలను 50-60%, అంతకన్నా ఎక్కువగా గుర్తించలేనివారికి.

వాక్యాలను 40-60%, అంతకన్నా ఎక్కువగా పసిగట్టలేనివారికి

రణగొణధ్వనుల మధ్య మాటలు సరిగా వినిపించనివారికి

వినికిడి సాధనాల తీవ్రతను పూర్తిస్థాయిలో పెంచినా ఫలితం లేనివారికి

శ్రవణనాడి దెబ్బతినటం వల్ల హఠాత్తుగా వినికిడిలోపం తలెత్తినా లేదా క్రమంగా పెరుగుతూ వస్తూ మందులతో ప్రయోజనం కలగనివారికి

త్వరగా అమర్చితే మరింత ప్రయోజనం

వినికిడిలోపాన్ని గుర్తిస్తే.. ముఖ్యంగా శిశువులకు, పిల్లలకు వీలైనంత త్వరగా కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చితే మంచి ప్రయోజనం కనిపిస్తుంది. ప్రస్తుతం నవజాత శిశువులకు వినికిడి పరీక్ష చేయిస్తున్నందున ముందుగానే వినికిడిలోపాన్ని గుర్తించటమూ సాధ్యమవుతోంది. కొద్ది వారాల వయసులోనే సమస్య బయటపడుతోంది. తీవ్ర వినికిడిలోపం ఉన్నట్టు తేలితే 6-12 నెలల్లోనే కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చాలని అంతర్జాతీయ మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. మెదడుపొర వాపుతో కాక్లియా దెబ్బతింటే ఇంకాస్త ముందుగానే అమర్చాలనీ చెబుతున్నాయి. దీంతో మాటలు మామూలుగా వచ్చేలా చూసుకోవచ్చు. లేకపోతే మూగవారిగా మిగిలిపోయే ప్రమాదముంది. ఎందుకంటే మనం ఎదుటివారి మాటలను వినటం, వాటిని అనుకరించటం ద్వారానే మాట్లాడటం నేర్చుకుంటాం మరి. రెండేళ్ల వయసులోపు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసిన పిల్లలకు మాటలు బాగా వస్తున్నట్టు అధ్యయనాలు, అనుభవాలు సూచిస్తున్నాయి. అందరిలా బడికి వెళ్లి చదువుకోవచ్చు. ఇతరులతో మాట్లాడే నైపుణ్యాలూ మెరుగవుతాయి. మాటలు రావటానికి ముందు.. అంటే 1-6 ఏళ్ల పిల్లలకు వినికిడి సాధనాలతో ప్రయోజనం కనిపించకపోతే, వీలైనంత త్వరగా కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చటమే మంచిది. అనంతరం రెండేళ్ల పాటు మాటలను వినిపించి, అర్థం చేసుకోవటానికి ఇచ్చే చికిత్స (ఏవీటీ) అవసరమవుతుంది.

మాటలు వచ్చిన తర్వాత వినికిడిలోపం తలెత్తిన పిల్లలకైతే (5-6 ఏళ్ల వయసులో)- మాటలు రాకముందు వినికిడి లోపించినవారితో పోలిస్తే వీరికి కాక్లియర్ ఇంప్లాంట్‌తో మరింత ఎక్కువ ఫలితం కనిపిస్తుంది. అప్పటికే శ్రవణ సంబంధ జ్ఞాపకం ఉండటం వల్ల త్వరగా పరికరానికి అలవాటు పడతారు. 3-6 నెలల్లోపే ఫోన్‌లో మాట్లాడగలిగే స్థితికి చేరుకుంటారు. మామూలుగా నలుగురితో మాట్లాడే సామర్థ్యం త్వరగా అబ్బుతుంది.

పెద్దవారికైతే- దీర్ఘకాలంగా వినికిడి లోపిస్తే.. ముఖ్యంగా శక్తిమంతమైన డిజిటల్ వినికిడి సాధనాలు పెట్టుకున్నా శబ్దాలు వినపడనివారికి కాక్లియర్ ఇంప్లాంట్స్ ఎంతో మేలు చేస్తాయి. శబ్దాలు స్పష్టంగా వినిపించేలా చేయటం ద్వారా ఇతరుల మీద ఆధారపడటాన్ని తగ్గిస్తున్నాయి. ఆత్మ విశ్వాసం, నలుగురితో సంబంధ బాంధవ్యాలు పెరగటానికి తోడ్పడుతున్నాయి. రోజువారీ పనులు హాయిగా చేసుకోవటం, భావోద్వేగ పరంగా స్థిరంగా ఉండటం సాధ్యమవుతుంది. చెవిలో మోత గలవారికి సమస్య తగ్గుముఖం పడుతుంది. అయితే కాక్లియర్ ఇంప్లాంట్ ఫలితాలు సమయానికి శస్త్రచికిత్స చేయటం, తగిన పరికరాన్ని ఎంచుకోవటం, అమర్చిన అనంతరం తీసుకునే మాటలను అర్థం చేయించే చికిత్స మీద ఆధారపడి ఉంటాయని గుర్తుంచుకోవాలి.

# గొంతుకు తేనె హాయి

గొంతునొప్పి, గరగరతో బాధపడుతున్నారా? అయితే తేనె తాగి చూడండి. గొంతు సమస్యల కోసం ప్రాచీనకాలం నుంచీ చిట్కా వైద్యంగా దీన్ని వాడుతూ వస్తున్నారు. ఇదెలా పనిచేస్తుందో శాస్త్రీయంగానూ రుజువైంది కూడా.

తేనెలో సహజ చక్కెర ఉంటుంది. ఇది నోటిని తీపి చేయటమే కాకుండా గొంతునొప్పి, జలుబు, ఫ్లూ లక్షణాలు తగ్గటానికి తోడ్పడుతుండటం ఆశ్చర్యకరం. దీనికి కారణం తేనెటీగలు పువ్వుల నుంచి సేకరించిన మకరందమే. ఇందులో చక్కెర మాత్రమే కాదు.. తక్కువ మోతాదులో ఎంజైమ్‌లు, విటమిన్లు, ఖనిజ లవణాల వంటివీ ఉంటాయి. తేనెను తీసుకున్నప్పుడు ఇవీ ఒంట్లోకి చేరతాయి. ఇదెలా పనిచేస్తుందంటే..

వాపు తగ్గుముఖం: తేనెలో రుచికారకాలు (ఫ్లేవనాయిడ్లు) ఉంటాయి. ఇవి ఒకరకం వృక్ష రసాయనాలు. వీటిల్లో వాపును తగ్గించే గుణాలుంటాయి. అందువల్ల గొంతునొప్పి ఉన్నప్పుడు కొద్దిగా తేనె తీసుకుంటే వాపు తగ్గి, కాస్త ఉపశమనం కలుగుతుంది.

సూక్ష్మక్రిములతో పోరాటం: తేనెలోని ఫ్లేవనాయిడ్లకు బ్యాక్టీరియా, వైరస్ భరతం పట్టే గుణమూ ఉంది. ఇవి రోగనిరోధకశక్తికి దన్నుగా నిలిచి హానికారకాలతో పోరాడటానికి తోడ్పడతాయి. అలాగని ఇది మందులకు ప్రత్యామ్నాయం కాదు. గొంతునొప్పి మరీ ఎక్కువగా వేధిస్తుంటే తగు చికిత్స తీసుకోవాల్సిందే.



గొంతు సాఫీగా: తేనె చిక్కగా, జిగురుగా ఉంటుంది. ఇది గొంతు లోపలి పొర మీద పూతలా పరచుకొని రక్షణగా నిలుస్తుంది. ఫలితంగా చిరాకు, గరగర తగ్గుతాయి. తేలికగా మింగటానికి తోడ్పడుతుంది.

దగ్గు నుంచి ఉపశమనం: గొంతుకు హాయినిచ్చే గుణాలు దగ్గు తగ్గటానికీ సాయం చేస్తాయి. దుకాణాల్లో అమ్మే దగ్గు మందుల కన్నా తేనె మరింత ఎక్కువ సమర్థంగా పనిచేస్తున్నట్టు.. ముఖ్యంగా రాత్రిపూట వేధించే దగ్గు నుంచి ఉపశమనం కలిగిస్తున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి.

ఎలా తీసుకోవాలి?

ఒకట్రెండు చెంచాల తేనె నేరుగా తీసుకోవచ్చు.

గోరువెచ్చటి నీటిలో నిమ్మరసం, తేనె కలిపి అయినా తీసుకోవచ్చు.

గ్రీన్ టీ, పుదీనా టీ వంటి వాటిల్లోనైనా కలిపి తాగొచ్చు.

# చెవి గులిమి తీయాల్సిందేనా?

%గులిమి తీస్తేనే చెవులు శుభ్రంగా ఉంటాయని కొందరు భావిస్తుంటారు. ఇది నిజం కాదు. చాలామందికి దానంతటదే బయటకు వస్తుంది. చెవి మార్గంలోని ప్రత్యేక చర్మం గులిమిని బయటకు తోస్తూ, ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుంది. అందువల్ల తీయాల్సిన పనిలేదు. చెవి మార్గం ముందుభాగంలోని వెంట్రుకలు, సెబేషియస్ గ్రంథుల నుంచి వెలువడే స్రావాలతో గులిమి తయారవుతుంది. ఇది లోపలి భాగాన్ని తడిగా ఉంచుతూ, మార్గం ఎండిపోకుండా చూస్తుంది. దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా, క్రిముల వంటివి లోనికి వెళ్లకుండా అడ్డుకుంటుంది. మృతకణాలు, వ్యర్థాలను తనలో కలిపేసుకుంటుంది. అంటే చెవికి సహజ రక్షణ కవచంగా నిలుస్తుందన్నమాట. కొందరికిది ఎక్కువగా తయారవ్వచ్చు. కొందరికిది చాలా జిగురుగా, మరికొందరికి గట్టిగానూ ఉండొచ్చు. ఏదేమైనా దీన్ని ప్రత్యేకించి తీయాల్సిన అవసరం లేదు. అగ్గిపుల్లలు, పిన్నీసులు, కాటన్ బడ్స్ వంటివి చెవిలో పెట్టి తిప్పితే గులిమి ఇంకా లోపలికి పోయే ప్రమాదముంది. చెవిలోని చర్మం, కర్ణభేరి దెబ్బతినొచ్చు. చెవి ఇన్‌ఫెక్షన్ కూడా తలెత్తొచ్చు. చాలాతక్కువ (5%) మందిలో గులిమి లోపల పోగవ్వచ్చు. వీరిలో 1-2% మందికి గట్టి పడి, చెవి మార్గం నిండిపోవచ్చు. ఇలాంటివారికే గులిమి తీయాల్సి వస్తుంది. అదీ ఈఎన్‌టీ నిపుణులతోనే తీయించుకోవాలి. వీరికి ముందుగా వారం పాటు రోజుకు మూడు సార్ల చొప్పున చెవిలో చుక్కల మందు లేదా గోరువెచ్చగా చేసి చల్లార్చిన ఆలివ్ నూనె వంటివి వేస్తారు. గులిమి మెత్తబడ్డాక మైక్రోస్కోపిక్ వ్యాక్యూమ్ సక్షన్‌తో జాగ్రత్తగా బయటకు తీస్తారు. కొన్నిచోట్ల చెవిలోకి సిరంజితో నీటిని బలంగా పంపించి, గులిమి బయటకు వచ్చేలా చేస్తుంటారు. ఇది సురక్షితం కాదు. దీంతో కొన్నిసార్లు కర్ణభేరి దెబ్బతినొచ్చు. అప్పటికే కర్ణభేరికి రంధ్రం ఉన్నట్టయితే హానికారకాలు లోపలి చెవికి చేరుకొని ఇన్‌ఫెక్షన్, నొప్పి, చీము కారటం వంటివి తలెత్తే ప్రమాదమూ ఉంటుంది.



# పన్ను తీసేస్తే కంటికి దెబ్బా?

పళ్లు తొలగిస్తే కళ్లు దెబ్బతింటాయనీ, చూపు తగ్గుతుందనీ చాలామంది నమ్ముతుంటారు. నాడులకు, మెదడుకు నష్టం కలుగుతుందని భావిస్తుంటారు. ఇది పూర్తిగా అపోహే. పంటికి, కంటికి ఎలాంటి సంబంధమూ లేదు. కింది పళ్లు కావొచ్చు, పై పళ్లు కావొచ్చు.. వేటిని తొలగించినా కళ్లకు గానీ ఇతర అవయవాలకు గానీ ఎలాంటి నష్టమూ కలగదు. పిల్లల్లో దంతాల అమరికను సరిచేయటానికి క్లిప్స్ వేసే సమయంలో ఎగుడు దిగుడుగా ఉన్నవాటిని కొన్నిసార్లు తొలగిస్తుంటారు కూడా. వీరిలో ఎవరికీ చూపు తగ్గిన ఉదంతాలు లేవు. కంటికి ఇబ్బంది కలిగినట్టు ఎక్కడా రిపోర్టు కాలేదు. పళ్లు, కళ్లు, ముఖంలోని నాడులు అన్నీ దగ్గరదగ్గరగా ఉండటం వల్ల పన్ను తీసేస్తే చూపు దెబ్బతింటుందనే అపోహ మొదలై ఉండొచ్చు. నిజానికి చూపును నియంత్రించే దృశ్యనాడి.. దంతాలకు, దవడలకు వెళ్లే నాడులు చాలా దూరంలో ఉంటాయి. ఇవి రెండూ పరస్పరం సమాచారమేమీ ఇచ్చిపుచ్చుకోవు. దంతాలను తొలగించినా వీటికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. ఇక రక్తనాళాల విషయానికి వస్తే- నోరు, ముఖంలోని రక్తనాళాలు.. కంటి రక్తనాళాలు రెండూ వేటికవే ప్రత్యేకం. దంత చికిత్సలతో కొన్నిసార్లు ముఖం చుట్టూ ఉబ్బినా కళ్లకు రక్తాన్ని ప్రసారం చేసే నాళాలకు ఎలాంటి ఆటంకం కలగదు. అందువల్ల చూపునకు ఎలాంటి ప్రమాదమూ వాటిల్లదు. పళ్లకు, కళ్లకు మధ్య గాలిగదులు (సైనస్) ఉంటాయి. ఒకవేళ పన్ను తొలగించినప్పుడు ఏదైనా ఇన్‌ఫెక్షన్ తలెత్తితే అది తీవ్రమై గాలిగదులకు చేరుకోవచ్చు. అయినా కూడా అదేమీ కంటి కుహరానికి చేరుకోదు. ఇది చాలా పగడ్బందీగా, సురక్షితంగా ఉంటుంది. కాబట్టి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఒకవేళ జ్ఞానదంతాలను తొలగించేటప్పుడు మత్తుమందు ఇచ్చే క్రమంలో సూది ఎప్పుడైనా నాడులకు తగిలితే తాత్కాలికంగా ముఖం మొద్దుబారినట్టు అనిపించొచ్చు. దీని మూలంగా కళ్లకు ఇబ్బంది కలుగుతున్నట్టు రుజువు కాలేదు. నిజానికి పళ్లు తొలగించుకోవాలని ఎవరూ కోరుకోరు.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy